www.bharathasakthi.com

# భారత శక్తి

VOICE OF INDIAN

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి : 21 | సంచిక : 27 | హైదరాబాద్ | బుధవారం,జులై 1 , 2026 | పేజీలు : 12 | వెల : 1.00

## ప్రజాప్రతినిధుల కోర్టులో బండి సంజయ్‌కి ఊరట



**హైదరాబాద్ (భారత శక్తి)** హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో నమోదైన ఒక పాత కేసులో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి పెద్ద ఊరట లభించింది. సుదీర్ఘ విచారణ అనంతరం ఆయనపై నమోదైన కేసును న్యాయస్థానం పూర్తిగా కొట్టివేసింది. అసలు విషయానికి వస్తే... హుజూరాబాద్ ఉప ఎన్నిక ప్రచార సమయంలో అప్పటి అధికార బీఆర్ఎస్ పార్టీపై బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార పార్టీ ఓటుకు ఏకంగా రూ.25 వేల వరకు పంచుతోందని, అందులో ఓటర్లకు కేవలం రూ.5 వేలు ఇచ్చి మిగిలిన మొత్తాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలే నొక్కేస్తున్నారంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈ విమర్శలపై అప్పట్లో తీవ్ర రాజకీయ దుమారం రేగింది. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకున్న హుజూరాబాద్ పోలీసులు.. బండి సంజయ్‌పై పలు కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రత్యేక కోర్టు.. ఆయనపై మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది.

# 9425.35 లక్షమంది రైతులకు
# 20వేల కోట్ల రుణమాఫీ

**- ఇప్పటి వరకు 27 వేల కోట్లు రైతు ఖాతాల్లో జమా**
**- రైతు భరోసా సభలో సీఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ (భారత శక్తి)** 2023 డిసెంబర్ 7 నాడు ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సమయంలో ఎనిమిది లక్షల పదకొండు వేల కోట్ల అప్పు ఉంది. 60 యేళ్లలో 69 వేల కోట్ల అప్పులు చేస్తే కేవలం కల్వకుంట్ల కుటుంబం 7 లక్షల కోట్ల కు పైగా అప్పు చేసి అప్పుల ఊబీలో నిండా ముంచారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.మంగళవారం నాడు జరిగిన రైతు భరోసా సభలో అయన మాట్లాడారు.సర్పంచ్ లకు వందల కోట్లు బకాయిలు పెట్టారు.. సర్పంచ్ లు ఆత్మహత్యలు చేసుకున్నారు.. సర్పంచ్ లు,

2లో..

## వికసిత భారత్ లక్ష్య సాధనలో
# యువతదే కీలక పాత్ర

**- విశాఖలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

- వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత కీలక పాత్ర పోషించాలని రాష్ట్రపతి పిలుపు
- కేంద్రీయ గిరిజన వర్సిటీ తొలి స్నాతకోత్సవంలో ప్రసంగం
- పట్టభద్రుల్లో 40 శాతం, స్వర్ణ పతక విజేతల్లో 70 శాతం అమ్మాయిలేనని హర్షం
- ఆధునిక సాంకేతికతతో గిరిజన సంస్కృతికి పునరుజ్జీవం తీసుకురావాలని సూచన
- గిరిజన విశ్వవిద్యాలయాలు ఆత్మవిశ్వాస కేంద్రాలుగా ఎదగాలి




**హైదరాబాద్ (భారత శక్తి)** వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో దేశ యువతదే కీలక పాత్ర అని... విద్య, సాధికారతే వారి ప్రధాన ఆయుధాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మన గిరిజన సంస్కృతి, వారసత్వానికి పునరుజ్జీవం తీసుకురావాలని ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం నాడు విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా

2లో..

## ఎమ్మెల్యే రాజాసింగ్‌కు
# క్లీన్ చిట్

**వీగిపోయిన వివాదాస్పద వ్యాఖ్యల కేసు!**

- ప్రజల సెంటిమెంట్ల ఆధారంగా శిక్షలు వేయలేం: ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు
- సాక్షుల నోట 'గ్రంథాల' నిజాలు..
- ఐఓ నిర్లక్ష్యం, ఫోరెన్సిక్ సాక్ష్యాల ట్యాంపరింగ్‌తో ఘోరంగా విఫలమైన ప్రాసిక్యూషన్.



**హైదరాబాద్ జూన్ 30:(భారత శక్తి ):** రాష్ట్ర రాజకీయాల్లోనూ, దేశవ్యాప్తంగానూ తీవ్ర సంచలనం సృష్టించిన వివాదాస్పద వ్యాఖ్యల కేసులో గోషామహల్ శాసనసభ్యుడు టి. రాజాసింగ్‌కు పెద్ద ఉపశమనం లభించింది. ఆయనపై మోపిన అన్ని చార్జీలను కొట్టివేస్తూ హైదరాబాద్‌లోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం మంగళవారం చారిత్రాత్మక

2లో..



## ప్రత్యేక బలగాలు..
# రాష్ట్ర భద్రతా కవచం!

- డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపాలి: డీజీపీ సి.వి. ఆనంద్
- బెటాలియన్ల ఆధునికీకరణ, సిబ్బంది సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యం
- 'మిత్ర' కేంద్రాల ద్వారా మానసిక ఒత్తిడి దూరం.. విధుల్లో పూర్తి పారదర్శకత

**హైదరాబాద్, జూన్ 30 భారత శక్తి :**తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల నిర్వహణ, విపత్తుల నిర్వహణ, అతి ముఖ్య వ్యక్తుల (వీఐపీ) బందోబస్తు, ప్రత్యేక ఆపరేషన్లలో కీలక భూమిక పోషిస్తున్న స్పెషల్ బెటాలియన్లు రాష్ట్ర భద్రతకు బలమైన కవచం లాంటివని రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈ బలగాలను మరింత ఆధునికంగా, సాంకేతికంగా బలోపేతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

2లో..

## డిగ్రీలు కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేదే నిజమైన విద్య: మంత్రి నారా లోకేశ్



**అమరావతి (భారత శక్తి)** ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడమే అసలైన విద్య అని, కేవలం డిగ్రీలు సంపాదించడం విద్యకు పరమార్థం కాదని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఉద్ఘాటించారు. నాణ్యమైన విద్య సమాజంలోని ప్రతి వర్గానికి, దేశంలోని ప్రతి మూలకు చేరినప్పుడే వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆయన అన్నారు. మంగళవారం విశాఖపట్నంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగిన కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ

2లో..

## జీహెచ్ఎంసీలో అధికారులే
# 'డీజిల్' దొంగలు



- ▶ నడవని బండ్లకు నకిలీ బిల్లులు.. కోట్ల రూపాయల ప్రజాధనం స్వాహా!
- ▶ విజిలెన్స్ విచారణతో బయటపడ్డ బండారం..
- ▶ ప్రైవేట్ బంకుల యజమానులు, బడా అధికారుల 'డీజిల్' బంధం!
- ▶ కాగితాల్లో 'ట్రిప్పులు'.. ఖజానాకు 'చిల్లులు'!
- ▶ జిహెచ్ఎంసి ట్రాన్స్పోర్ట్ ఉన్నతాధికారి అడిషనల్ కమిషనర్ అడ్మిన్ శంకరయ్య అక్రమార్కులకు సపోర్ట్..
- ▶ ట్రాన్స్పోర్ట్ ఫోర్ మెన్ల అక్రమాలపై శాఖపరమైన చర్యలు ఎక్కడ..!
- ▶ జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ , మున్సిపల్ శాఖ సెక్రటరీ జయేష్ రంజన్, మున్సిపల్ శాఖ మంత్రి సీ.ఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలంటూ స్థానికుల డిమాండ్..

నగసెకసుల చెమట చుక్కల పన్నుల సొమ్ముతో, జీహెచ్ఎంసీ 'అవినీతి తిమింగలాలు' డీజిల్ దాహాన్ని తీర్చుకుంటున్నాయి. నగరంలో చెత్త బండ్లు కదలకున్నా.. తెరవెనుక మాత్రం బిల్లుల చక్రాలు 'జెట్' స్పీడుతో తిరుగుతున్నాయి! ప్రైవేట్ బంకుల యజమానులు, బడా బాబులు కలిసి కుదుర్చుకున్న 'డీజిల్ బంధం' కోట్ల రూపాయల ప్రజాధనాన్ని నైస్‌గా స్వాహా చేసింది. ఏడాదికి 365 రోజులూ విరామం లేకుండా బండ్లు తిరిగేసినట్లు కాగితాల్లో రికార్డులు సృష్టించి, ఖజానాను ఖాళీ చేసిన సదరు 'మహాత్ముల' లీలలు విజిలెన్స్ విచారణతో బట్టబయలయ్యాయి. ప్రజాధనాన్ని లూటీ చేస్తూ, నగర ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఈ నకిలీ బిల్లుల వీరుల లైసెన్సులు రద్దు చేసి, ఊచలు లెక్కించకపోతే.. వ్యవస్థకు పట్టిన ఈ 'అవినీతి తుప్పు' వదిలేదెలా?







3లో..

## దేశంలో మరో పరీక్షల
# లీకుల కేసు

**- రాజస్థాన్‌లో భారీ ఎగ్జామ్ స్కామ్ - RPMC పారామెడికల్ పరీక్ష రద్దు..**
**- కాలేజ్ డైరెక్టర్‌తో సహా నలుగురు అరెస్ట్!**




**జైపూర్, జూన్ 30:** రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో భారీ పరీక్షల కుంభకోణం వెలుగుచూసింది. రాజస్థాన్ పారామెడికల్ కౌన్సిల్ (RPMC) నిర్వహిస్తున్న డిప్లొమా ప్రథమ సంవత్సరం, బ్యాక్‌లాగ్ పరీక్షల పేపర్ లీక్, కాపీయింగ్ ముఠా గుట్టును జైపూర్ పోలీసులు రట్టు చేశారు. ప్రభా దేవి మెమోరియల్ పీజీ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఒకే గదిలోని 45 మంది విద్యార్థులను అక్రమ మార్గంలో పాస్ చేయించడానికి ఏకంగా రూ. 5.50 లక్షల భారీ డీల్ కుదిరినట్లు విచారణలో తేలింది.పక్కా సమాచారంతో దాడి చేసిన పోలీసులు.. కాలేజ్ డైరెక్టర్ రామకృష్ణ మండివాల్, అతని మేనల్లుడు దేవ్‌కృష్ణ, హెచ్ఓడీ కృష్ణ కుమార్ సైనీ, లెక్చరర్ శంకర్ లాల్ జట్‌లను అరెస్ట్ చేశారు. నిందితుల మొబైల్స్, డైరీలను పరిశీలించగా వాట్సాప్‌లో హాల్ టికెట్ల పీడిఎఫ్ ఫైళ్లు, లీకైన సమాచారం దొరికింది. తమకు నచ్చిన ఇన్విజిలేటర్లను ఎగ్జామ్ హాల్స్‌లో వేయించుకోవడానికి ఇప్పటికే రూ. 3.27 లక్షలు చేతులు మారినట్లు తేలింది.

### పరీక్ష కేంద్రం బ్లాక్‌లిస్ట్ - ఎగ్జామ్స్ రద్దు

ఈ భారీ అక్రమాలు వెలుగుచూడటంతో పరీక్షా కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహం వ్యక్తం చేసిన తోటి విద్యార్థులు కాలేజీ ఆవరణలో ఫర్నిచర్ ధ్వంసం చేస్తూ భారీ ధర్నాకు దిగారు. దీనితో స్పందించిన రాజస్థాన్ పారామెడికల్ కౌన్సిల్.. ప్రభా దేవి మెమోరియల్ కాలేజీ కేంద్రాన్ని తక్షణమే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, అక్కడ జరగాల్సిన DCLT, DDT, DECGT కోర్సుల పరీక్షలను రద్దు చేస్తూ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు వాయిదా వేసింది.

# 9425.35 లక్షల మంది రైతులకు ఇరవై వేల కోట్ల రైతు రుణమాఫీ

ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ధర్నాలు చేశారు. బకాయిలు పెట్టింది బకాసురులు.. కట్టే పని మాత్రం నాకు పడింది. ఇనుప కంచెలు వేసుకుని నేను లోపల లేను. గద్దరన్న ప్రగతి భవన్ కు పోతే ఎండలో నాలుగు గంటలు కూర్చోబెట్టాడు. షేర్వానీ వేసుకుని నవాబు అని చెప్పుకోలేం.. మనం నవాబులం కాదు బీకార్లం . స్వయం సహాయక మహిళలు బడి పిల్లలకు వండి పెడితే వాళ్లకు కూడా డబ్బులు ఇవ్వలేదని అన్నారు. 25.35 లక్షల మంది రైతులకు ఇరవై వేల కోట్ల రైతు రుణమాఫీ చేశాం. రైతు భరోసా కింద ప్రభుత్వం రాగానే 7 వేల కోట్ల రూపాయలు చెల్లించాం. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లో బకాయిలు పెట్టిపోతే 2023 లో చెల్లించాం. రైతు భరోసాను 12 వేల కు పెంచి ఇప్పటి వరకు 27 వేల కోట్లు రైతు ఖాతాల్లో వేశాం. ఈ విడుత తో కలిసి 36 వేల కోట్ల రైతు భరోసా కింద చెల్లించాం. ఉచిత కరెంటు ను కనిపెట్టిందే కాంగ్రెస్ పార్టీ. ఉచిత కరెంటు కాంగ్రెస్ పార్టీ పెటెంట్అని అన్నారు. ఉచిత కరెంటు మాది అన్న సన్నాసులను ఆడబిడ్డలు చీపురుకట్టలు తిరగేసి కొడతరు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు ఉచిత కరెంటుతో పాటు విద్యుత్ బకాయిలను రద్దు చేస్తు సంతకం పెట్టారు. కాంగ్రెస్ వస్తే కరెంటు కష్టాలు అని ఇప్పుడు విమర్శిస్తున్నారు. నెలకు 1000 కోట్ల రూపాయలను ఉచిత కరెంటు కోసం ఖర్చు చేస్తున్నాం.. ఇప్పటి వరకు 30 వేల కోట్లు ఖర్చు చేశాం. సన్న వడ్ల బోనస్ కోసం 4 వేల కోట్ల ఖర్చు చేశాం. మూడు న్నర వేల కోట్ల రైతు బీమా కోసం ఖర్చు చేశాం. రైతుల కోసం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేద్దాం..చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. పదేళ్లలో మీరు ఏం చేశారో, రెండున్నర యేళ్లలో మేం ఏం చేశామో చర్చకు సిద్ధం. కాళేశ్వరం కోసం లక్షా రెండు వేల కోట్లు చెల్లిస్తే రెండేళ్లలో కూలిపోయి కూలేశ్వరం అయింది.. డబ్బులు గోదావరి లో కలిసిపోయాయి. ఏ ఊరిలో రైతులు పంటలు పండించినా కాళేశ్వరం నీళ్లతోనే పండాయి అన్నారు. మూడేళ్లలో కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా 2 కోట్ల 80 లక్షల టన్నుల ధాన్యాన్ని తెలంగాణ రైతుల పండించారు. కేసీఆర్..ఎంత కాలం కాశీ మజిలీ కథలు చెపుతావు. ఆయన కథలు విన్న తర్వాత తెలంగాణ ప్రజలు ఫామ్ హస్ లో పెట్టారు. చిన్న రాక్షసులు బయలుదేరి కేసీఆర్ రావాలని కోరుకుంటున్నారని చెపుతున్నాడు. కేసీఆర్ రావాలని ఎవరు కోరుకుంటున్నారు..? లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదు.. దళితులకు మూడెకరాలు ఇవ్వలేదు.. కోటీ ఎకరాలకు నీళ్లు ఇస్తానని చెప్పి ఇవ్వలేదు. అన్ని కల్చర్లను సర్వనాశనం చేసి తాగుడు కల్చర్ పెట్టాడు. మేం రైతు బజార్లు తెస్తే కేసీఆర్ బెల్ట్ బజార్లు తెచ్చాడు. పిల్లలను కూడా కేసీఆర్ తాగుబోతులను చేశాడు. ప్రతి పేదవాడి ఖాతాల్లో 15 లక్షలు వేస్తానని మోదీ చెప్పాడు.. యేడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్నాడు.. 24 కోట్ల ఉద్యోగాలు రావాలి ..వచ్చాయా..? తెలంగాణలో బండి సంజయ్, కిషన్ రెడ్డికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాడు. బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చే ప్రభుత్వం మాదే అంటున్నాడు.. ఏందీ వచ్చేది.. తెలంగాణలో ఆటలు సాగవు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు 8 వేల కోట్ల బకాయిలు పెట్టిపోయారు. ఆర్టీసీ 1000 కోట్ల లాభాల్లోకి వచ్చింది.. సింగరేణి లాభాల్లోకి తెచ్చాం. ధరణి ని బంగాళాఖాతంలో వేసి భూభారతి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తున్నాం. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నాం.. ఇప్పటి వరకు 11 వేల కోట్ల రూపాయలను ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించింది. .ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం వద్దని ఆటో వాళ్లను రెచ్చగొట్టి ధర్నాలు చేయించే ప్రయత్నం చేశారు. 1000 బస్సులకు మహిళా సంఘాలను యజమానులను చేశాం. స్వయం సహాయక మహిళలతో 1000 మెగా వాట్ల సోలార్ ప్లాంట్లను పెట్టించాం. రిలయెన్స్ తో పోటీ పడేలా మహిళా సంఘాలతో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించాం. స్వయం సహాయక మహిళల స్టాల్స్ కోసం 1000 కోట్ల రూపాయల విలువ చేసే స్థలాన్ని శిల్పారామంలో కేటాయించాం. యాదయ్య, యాదిరెడ్డి, ఇషాన్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, కానిస్టేబుల్ కిష్టయ్య లాంటి వాళ్లు తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్నారు. కేసీఆర్ తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నాడు. ఇప్పటి వరకు మేం 30 నెలల్లో 70 వేల ఉద్యోగాలు ఇచ్చాం. ప్రతి డిపార్ట్మెంట్ లో ఉద్యోగాలు భర్తీ చేశాం.. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నాం. దమ్ముంటే రాజీనామా చేయాలని అంటున్నారు. నీ అయ్య జాగీరా, నీ తాత గడీలు అనుకుంటున్నవా, గడీల ముందు బానిసలమా రాజీనామా చేయడానికి. వరి వేసుకుంటే ఉరే అన్న కేసీఆర్ ఫామ్ హౌస్ లో వరి పండించి నాలుగు వేల రెండువందలకు క్వింటా అమ్ముకున్నాడు. కేసీఆర్ మళ్లీ వస్తే భార్య భర్తల ఫోన్లు వింటాడు తప్ప ఏమీ చేయడని అన్నారు. పెళ్లాం మొగుడు మాట్లాడుకున్న మాటలు వినడానికి సిగ్గుండాలి. సొంత బిడ్డ కూడా నేను, నా భర్త మాట్లాడుకుంటు విన్నారని చెప్పింది.. ఇంకా ఎందుకు ఆ బతుకు . పాపాల భైరవుడు ఫామ్ హౌస్ లో ఉన్నాడు.. మళ్లీ రావాలంట.. ఆయన కోసం జనం ఎదురు చూస్తున్నారట. ఉన్నది ఉన్నట్లు చెపుతా.. చేసేది చెపుతా. కిరిటాలు పెట్టుకోవాలి, వజ్ర వైడూర్యాలు సంపాదించాలని నాకు లేదు.. పదవి శాశ్వతం కాదు. మాట శాశ్వతం.. మాట కోసం ఎంతకైనా నిలబడతాడు అన్న పేరు కోసం ప్రయత్నం. అబద్దాల పునాదులపైన ప్రభుత్వాన్ని నడపను. కాలానికి తగ్గట్లుగా రైతులు వ్యవసాయాన్ని మార్చుకోవాలి. ఈ సారి వర్షాలు పడవని శాస్త్రవేత్తలు చెపుతున్నారు... వర్షాలను బట్టి పంటలు వేసుకోవాలి. 7 రకాల సన్న వడ్ల విత్తనాలను రైతు వేదికల్లో అందుబాటులో ఉంచాం. డిమాండ్ ఉన్న సన్న వడ్ల ను వేయమని రైతులకు చెపుతున్నాం. ఒక్క నిజం చెప్పితే తలకాయ వెయ్యి వక్కలు అవుతుందన్న శాపం కల్వకుంట్ల కుటుంబానికి ఉన్నట్లుంది. ఒకరికి మించి ఒకరు అబద్దాలు చెపుతున్నారు.. కేసీఆర్ ను మించి అబద్దాలు చెపుతున్నారు. బుద్ది మారనంత వరకు దేవుడు వాళ్లను క్షమించరు. బతుకమ్మ చీరలను జొన్న చేను కాడ పిట్టలు కొట్టడానికి కట్టారు. మేం పెట్టిన చీరలను ఆడబిడ్డలు సంతోషంగా కట్టుకుంటున్నారు. 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయలను రైతు భరోసా కింద చెల్లిస్తాం.. నగదు సిద్ధం చేశాం. ఈ ప్రభుత్వం మీది.. ఈ ప్రభుత్వం ప్రజలది.. ప్రభుత్వం రైతులది, ఆడబిడ్డలది, నిరుద్యోగులదని అన్నారు. 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీ కి నోటిఫికేషన్ ఇస్తామంటే వద్దని అంటున్నారు. మూసీ వద్దని, మెట్రో వద్దని, రీజనల్ రింగ్ రోడ్డు వద్దని అంటున్నారు. పోర్లు దండాలు పెట్టినా అన్ని పనులు చేస్తా. ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత రైతులది. కేసీఆర్ లాంటి తప్పుడు పనులు మాత్రం మేం చేయం. ఎమ్ చేసినా చేయకపోయినా మేము భార్యభర్తలు మాట్లాడు కుంటే మాత్రం వినం . ఫామ్ హౌస్ లో పశుపతిని బంధించాను.. అరుంధతి సినిమాలో రాక్షసుడిలా ఫామ్ హౌస్ లో రైతులు బంధించారని అన్నారు.

# ప్రత్యేక బలగాలు.. రాష్ట్ర భద్రతా కవచం!

జూబ్లీహిల్స్‌లోని తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ప్రధాన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా ప్రధాన కార్యాలయంలోని వివిధ పరిపాలనా విభాగాలు, సమాచార వ్యవస్థ, ఆయుధాల నిర్వహణ, సాంకేతిక విభాగాలు, నిర్మాణ పనులు, మౌలిక వసతులను డీజీపీ స్వయంగా పరిశీలించారు. అనంతరం అధికారులు సమర్పించిన నివేదికలపై (ప్రజెంటేషన్) సమీక్ష జరిపి, పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఖాళీగా ఉన్న పోస్టులను త్వరగా భర్తీ చేయడం, వాహనాల సంఖ్యను పెంచడం, సిబ్బందికి మెరుగైన నివాస వసతులు, తాగునీరు, వైద్య సౌకర్యాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

## నక్సల్స్ నిర్మూలనలో వీరోచిత పాత్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ఉద్యమం తీవ్రంగా ఉన్న సమయంలో అప్పటి ప్రత్యేక పోలీస్ (ఏపీఎస్పీ) బలగాలు శాంతిభద్రతల రక్షణలో వెన్నుదన్నుగా నిలిచాయని డీజీపీ గుర్తుచేశారు. “నేను నిజామాబాద్, వరంగల్ జిల్లాల పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ)గా పనిచేసిన కాలంలో పోలీస్ స్టేషన్లపై నక్సల్స్ దాడులు జరిగేవి. ఆ క్లిష్ట పరిస్థితుల్లో స్పెషల్ పోలీస్ బలగాలు అత్యంత ధైర్యసాహసాలతో విధులు నిర్వహించి నక్సల్స్ నిర్మూలనలో కీలక పాత్ర పోషించాయి” అని ప్రశంసించారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం 13 స్పెషల్ బెటాలియన్లను ఏర్పాటు చేసిందని, ఇటీవల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సంభవించిన భారీ వరదల సమయంలో ఈ సిబ్బంది ప్రాణాలకు తెగించి ప్రజలను కాపాడటం అభినందనీయమన్నారు.

## డ్యూటీల కేటాయింపులో వివక్ష వద్దు

పరిపాలనలో క్రమశిక్షణతో పాటు మానవతా దృక్పథం అవసరమని, విధులను కేటాయించే విధానంలో పూర్తి పారదర్శకత పాటించాలని డీజీపీ స్పష్టం చేశారు. ఎలాంటి వివక్ష లేకుండా, నిష్పాక్షికంగా అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. గతంలో 18 నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు ఉండేవని, ఇప్పుడు ఆ సమస్య పూర్తిగా సమసిపోయిందని తెలిపారు. భవిష్యత్తు అవసరాలను, విస్తరిస్తున్న నగరాలను దృష్టిలో ఉంచుకుని ‘ఫ్యూచర్ సిటీ’, ఆమనగల్ ప్రాంతాల్లో కొత్త స్పెషల్ బెటాలియన్ల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

## వ్యసనాలకు దూరం.. ‘మిత్ర’తో మానసిక బలం

## కమాండెంట్లకు డీజీపీ కీలక సూచనలు:

నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండే సిబ్బందికి మానసిక ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. అధికారులే వారికి కొండంత అండగా నిలవాలి. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి సామాజిక వ్యసనాల బారిన సిబ్బంది పడకుండా నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలి. వ్యసనాలకు లోనైన వారిని శిక్షించడం కంటే ముందు, వారిని గుర్తించి కౌన్సెలింగ్, వైద్య సహాయం ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావాలి.

పోలీసు సిబ్బందిలో మానసిక ఆరోగ్య పరిరక్షణకు, ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డీజీపీ ఆదేశించారు. ఇందుకోసం ‘మిత్ర’ కౌన్సెలింగ్ కేంద్రాలను మరింత సమర్థంగా వినియోగించుకోవాలన్నారు.

సిబ్బంది ప్రవర్తనలో వచ్చే మార్పులను సహచరులు, అధికారులు ముందుగానే గుర్తించి స్పందించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక ఆయుధాల వినియోగం, విపత్తు నిర్వహణ, శారీరక–మానసిక దృఢత్వంపై సిబ్బందికి నిరంతర శిక్షణ అందించాలని స్పష్టం చేశారు. ఆధునికీకరణ, క్రమశిక్షణ, సాంకేతికత, సిబ్బంది సంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో బెటాలియన్లు ముందుకు సాగాలని డీజీపీ సి.వి. ఆనంద్ దిశానిర్దేశం చేశారు.

# ఎమ్మెల్యే రాజాసింగ్‌కు క్లీన్ చిట్

తీర్పు వెలువరించింది. మంగళహాట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నంబర్ “261/2022 (సీసీ నంబర్ 472/2023)” కేసు విచారణలో ప్రాసిక్యూషన్ మోపిన ఆరోపణల్లో ఏ ఒక్కదానిని కూడా సహేతుకమైన ఆధారాలతో నిరూపించలేకపోవడంతో

న్యాయస్థానం రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ విముక్తి కల్పించింది. గతంలో ఐపీసీ సెక్షన్లు 153A(a)(b), 295A, 504, 505(2), మరియు 506 కింద వివిధ మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టారనే తీవ్రమైన అభియోగాలతో
పోలీసులు ఈ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే.

## చట్టాన్ని కాదని.. ‘పీడీ యాక్ట్’ దాకా వెళ్లిన నాటకీయ పరిణామాలు

ఈ కేసు తొలినుంచీ తీవ్ర రాజకీయ ఉత్కంఠ రేపింది. కేసు నమోదైన వెంటనే రంగంలోకి దిగిన మంగళహాట్ పోలీసులు రాజాసింగ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టగా, చట్టపరమైన నిబంధనలు పాటించలేదన్న కారణంతో నాటి న్యాయమూర్తి పోలీసు రిమాండ్‌ను తిరస్కరించారు. అయితే, దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అప్పటి ప్రభుత్వం, తక్షణమే స్పందిస్తూ రాజాసింగ్‌పై ముందస్తు నిర్బంధ చట్టం (పీడీ యాక్ట్) ప్రయోగించి జైలుకు తరలించింది. ప్రభుత్వ పెద్దల జోక్యంతో సాగిన ఈ పరిణామాలు అప్పట్లో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున రాజకీయ, సామాజిక చర్చకు దారితీశాయి.

## ప్రాసిక్యూషన్ సాక్షులే తిరగబడ్డారు: కోర్టులో వెల్లడైన నిజాలు

న్యాయస్థానంలో జరిగిన పూర్తిస్థాయి విచారణలో ప్రాసిక్యూషన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. స్వయంగా ప్రాసిక్యూషన్ నిలబెట్టిన ముఖ్య సాక్షులే క్రాస్ ఎగ్జామినేషన్‌లో నిజాలను ఒప్పుకోవడంతో కేసు పునాదులు కదిలిపోయాయి. మొదటి సాక్షి (PW-1) వాంగ్మూలం: నిందితుడు ప్రస్తావించిన అంశాలు ఇస్లామిక్ గ్రంథమైన ‘సహీహ్ అల్–బుఖారీ’లో ఉన్న మాట వాస్తవమేనని అంగీకరించారు.

## రెండవ సాక్షి (PW-2) తోపాటు పవిత్ర ఖురాన్ ప్రస్తావన:

పవిత్ర ఖురాన్‌లోని ‘సూరా అల్–అహ్జాబ్ (33:37)’ లో ఉన్న అంశాల ఆధారంగానే సదరు వ్యాఖ్యలు ఉన్నాయనే విషయాన్ని సాక్షులు కోర్టు సమక్షంలో ఒప్పుకున్నారు. దీంతో నిందితుడు సొంతంగా కల్పించి ఏ వ్యాఖ్యలు చేయలేదనే వాదనకు బలం చేకూరింది.

## దర్యాప్తు అధికారి ఘోర వైఫల్యం.. చార్జ్‌షీట్ అంతా తొందరపాటే!

కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు కనీస ముందస్తు దర్యాప్తు కూడా చేయలేదని దర్యాప్తు అధికారి (ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్) కోర్టు బోనులో ఒప్పుకోవడం గమనార్హం. నిందితుడు చేసిన వ్యాఖ్యలు ప్రామాణికమైన, గుర్తింపు పొందిన ఇస్లామిక్ మత గ్రంథాల ఆధారంగా చేసినవా? కాదా? అనే ప్రాథమిక నిజాన్ని తాను చార్జ్‌షీట్ దాఖలు చేయడానికి ముందు ఎప్పుడూ సరిచూసుకోలేదని ఐఓ అంగీకరించారు. కేవలం రాజకీయ లేదా పైస్థాయి ఒత్తిళ్ల వల్లే చట్టపరమైన నిబంధనలను పక్కనబెట్టి ఆరోపణలు మోపినట్లు దీని ద్వారా స్పష్టమైంది.

## కత్తిరింపుల వీడియోలు.. డిజిటల్ సాక్ష్యాల ట్యాంపరింగ్!

సాంకేతిక ఆధారాలను (ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్) నిరూపించడంలోనూ ప్రాసిక్యూషన్ ఘోరంగా విఫలమైంది. నిందితుడికి వ్యతిరేకంగా పోలీసులు సమర్పించిన వివాదాస్పద వీడియో ఒరిజినల్ కాదని, అందులో మధ్యమధ్యలో కత్తిరింపులు, అంతరాయాలు (Discontinuities) ఉన్నాయని ప్రాసిక్యూషన్ తరఫున హాజరైన ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణుడే (FSL Expert) స్వయంగా ధృవీకరించారు.

అంతేకాకుండా, డిజిటల్ సాక్ష్యాలను సేకరించినప్పటి నుండి కోర్టుకు సమర్పించే వరకు అనుసరించాల్సిన చట్టబద్ధమైన భద్రతా నిబంధనల (Chain of Custody) విషయంలో పోలీసులు తీవ్ర లోపాలకు పాల్పడ్డారని న్యాయస్థానం తప్పుబట్టింది.

## ప్రజల సెంటిమెంట్ల ఆధారంగా శిక్షలు వేయలేం: కోర్టు కీలక వ్యాఖ్యలు

కోర్టు ముందుంచిన మౌఖిక మరియు పత్రాల ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన ప్రత్యేక న్యాయస్థానం.. నిందితుడిపై మోపిన ఏ ఒక్క నేరారోపణను కూడా సహేతుకమైన సందేహానికి తావులేకుండా నిరూపించడంలో ప్రాసిక్యూషన్ పూర్తిగా విఫలమైందని స్పష్టం చేస్తూ తీర్పులో కీలక వ్యాఖ్యలు చేసింది.

“నేర నిరూపణలు అనేవి కేవలం ఊహాగానాలు, గుడ్డి ఆరోపణలు లేదా ప్రజల సెంటిమెంట్లపై ఆధారపడి జరగవు. ప్రాసిక్యూషన్ చట్టబద్ధంగా, నమ్మదగిన సాక్ష్యాలతో నేరాన్ని నిరూపించాల్సి ఉంటుంది. అలా చేయనప్పుడు చట్టం ప్రకారం నిందితుడిని నిర్దోషిగా విడుదల చేయాల్సిందే.”

## ఇది రాజకీయ కక్షసాధింపుపై లభించిన విజయం: డిఫెన్స్ లాయర్

తీర్పు అనంతరం రాజాసింగ్ తరఫు ప్రముఖ న్యాయవాది లికె. కరుణా సాగర్‌లి విలేకరులతో మాట్లాడుతూ.. “రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే అప్పటి ప్రభుత్వం రాజాసింగ్‌పై ఈ తప్పుడు కేసు పెట్టింది. చట్టాన్ని, పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా పీడీ యాక్ట్ పెట్టారు. కానీ, తుదికి న్యాయమే గెలిచింది. న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు చట్టసభల ప్రతినిధులకే కాకుండా, పౌరుల భావప్రకటనా స్వేచ్ఛకు దక్కిన విజయం” అని హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన

**హుజురాబాద్ టౌన్,** హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని హుజూరాబాద్ టౌన్ సెక్షన్‌లో మంగళవారం నిర్వహించిన ‘ప్రజాబాట’ కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, వ్యవసాయదారులకు విస్తృత అవగాహన కల్పించామని కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) శ్రీ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందికి విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి ‘వన్ మినిట్ సేఫ్టీ’ సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని, ఏవైనా లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు ఉపయోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పొడవైన విద్యుత్ లైన్లపై మధ్య స్తంభాల ఏర్పాటు, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ మార్పిడి, వదులుగా ఉన్న వైర్ల (లూజ్ స్పాన్లు) సరిదిద్దడం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను ఎత్తు పెంచడం, వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు




# వికసిత భారత్ లక్ష్య సాధనలో యువతదే కీలక పాత్ర

హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, యూనివర్సిటీ తొలి స్నాతకోత్సవంలో పాల్గొనడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. పట్టాలు, పతకాలు అందుకున్న విద్యార్థులకు, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపకులకు, ప్రోత్సాహం అందించిన తల్లిదండ్రులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ యూనివర్సిటీలో పట్టాలు పొందిన విద్యార్థులలో దాదాపు 40 శాతం మంది, స్వర్ణ పతకాలు సాధించిన వారిలో 70 శాతం మంది అమ్మాయిలే కావడం పట్ల ఆమె ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు. ఇది మహిళా సాధికారతకు, లింగ సమానత్వం పట్ల సంస్థకున్న నిబద్ధతకు నిదర్శనమని ప్రశంసించారు. గిరిజన విశ్వవిద్యాలయాలపై ప్రత్యేక బాధ్యతలు ఉన్నాయని రాష్ట్రపతి గుర్తుచేశారు. ఈ సంస్థలు కేవలం విద్యా కేంద్రాలుగా మిగిలిపోకుండా, గిరిజన సమాజంలో ఆత్మవిశ్వాసం, నాయకత్వం, విధాన రూపకల్పనకు కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్య, ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, జీవనోపాధి, వనాధికారాల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన బాధ్యత ఇలాంటి సంస్థలపై ఉందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో ఈ విశ్వవిద్యాలయం గిరిజన యువత సర్వతోముఖాభివృద్ధికే కాకుండా, ఈ ప్రాంత సమగ్ర వికాసానికి కూడా గణనీయమైన కృషి చేస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు తెలిపారు. ప్రియమైన విద్యార్థులారా, ఈ స్నాతకోత్సవం మీ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టం. ఇది సంతోషించుకునే రోజే అయినా, భవిష్యత్తుపై సంకల్పం తీసుకోవడానికి కూడా ప్రేరణనిస్తుంది. వేగంగా మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకోవాలంటే యువత నూతన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించారు. పుస్తక పరిజ్ఞానంతో పాటు, మీ పరిసరాల నుంచి నేర్చుకుంటూ, ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆమె విద్యార్థులకు హితవు పలికారు. తమ సంస్కృతి, సంప్రదాయాలతో అనుబంధం కొనసాగిస్తూనే దేశ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు. అటవీ ఉత్పత్తులు, హస్తకళలు, చిరుధాన్యాలు, ఔషధ మొక్కలు, ఎకో–టూరిజం, స్థానిక నైపుణ్యాలను ప్రోత్సహించేలా గిరిజన విశ్వవిద్యాలయాల్లో నూతన ఆవిష్కరణలు జరగాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ దిశగా ఉత్తరాంధ్ర గిరిజన తెగల సాధికారత కోసం ఈ వర్సిటీ ‘సైన్స్ అండ్ టెక్నాలజీ హబ్’ను నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. గిరిజన సంక్షేమం, ప్రజారోగ్యం, వాతావరణ మార్పులు, ఆహార భద్రత, ఇంధన పరిరక్షణ వంటి అంశాలపై ఈ విశ్వవిద్యాలయం దృష్టి సారించిందని తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. సమ సమాజంతో కూడిన వికసిత భారత్ నిర్మాణంలో ఈ అంశాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆమె పేర్కొన్నారు.

## డిగ్రీలు కాదు... ప్రజల జీవితాల్లో మార్పు తెచ్చేదే నిజమైన విద్య: మంత్రి నారా లోకేశ్

ఆఫ్ ఆంధ్రప్రదేశ్) తొలి స్నాతకోత్సవంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. “ప్రతి తరం ఒక దేశాన్ని వారసత్వంగా స్వీకరిస్తుంది. కానీ ఆ దేశ భవిష్యత్తును నిర్ణయించేది విద్య మాత్రమే. విశ్వవిద్యాలయాలు కేవలం డిగ్రీలు అందించే సంస్థలు కావు. అవి కలలకు రూపమిస్తాయి, ఆత్మవిశ్వాసాన్ని నింపుతాయి, నాయకులను తయారు చేస్తాయి. ఈ రోజు జరుగుతున్నది కేవలం ఒక స్నాతకోత్సవం కాదు, ఇది అవకాశాల, సమ్మిళిత అభివృద్ధి వేడుక” అని అభివర్ణించారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెంది, అన్ని వర్గాలు భాగస్వాములైనప్పుడే వికసిత్ భారత్ సాధ్యమని లోకేశ్ తెలిపారు. “గిరిజన ప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు కేవలం విద్యా కేంద్రాలుగా కాకుండా, సామాజిక పరివర్తనకు మార్గదర్శకాలుగా నిలుస్తాయి. ఒక కుటుంబంలో తొలి తరం విద్యార్థి పట్టభద్రుడైతే, ఆ కుటుంబంతో పాటు దేశం కూడా పురోగమిస్తుంది. మన గిరిజన వారసత్వాన్ని కాపాడుకుంటూ, పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా ప్రతి పౌరుడికి సాధికారత కల్పించడమే వికసిత్ భారత్ స్ఫూర్తి” అని ఆయన వివరించారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) యుగంలో మానవ విలువల ప్రాధాన్యతను లోకేశ్ నొక్కిచెప్పారు. “ఏఐ మనకు సమాధానాలు ఇవ్వగలదు, కానీ మానవీయ విలువలు, జిజ్ఞాస, కరుణ, వ్యక్తిత్వం వంటి లక్షణాలను ఎప్పటికీ భర్తీ చేయలేదు. ఈ విలువలు గొప్ప విశ్వవిద్యాలయాల్లోనే పెంపొందుతాయి. అందుకే వర్సిటీలు నైపుణ్యం ఉన్న వృత్తి నిపుణులతో పాటు బాధ్యతాయుతమైన పౌరులను, మానవతా దృక్పథం కలిగిన నాయకులను తయారు చేయాలి” అని ఆయన ఆకాంక్షించారు. ప్రధాని మోదీ కలలుగన్న వికసిత్ భారత్ నిర్మాణంలో నాణ్యమైన విద్య, ఆవిష్కరణలే కీలకమని లోకేశ్ అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు అభినందనలు తెలుపుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఏపీ ఉన్నత విద్యలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని తెలిపారు. “మా లక్ష్యం డిగ్రీలు పొందిన విద్యార్థులను తయారు చేయడం కాదు, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడం. పరిశ్రమల అవసరాలకు తగిన నైపుణ్యాలు, పరిశోధన, ఆవిష్కరణలకు పెద్దపీట వేస్తూ భవిష్యత్ విశ్వవిద్యాలయాలను నిర్మిస్తున్నాం. ప్రతి విద్యార్థి ఉపాధికి అర్హుడు కావాలి, ప్రతి వర్సిటీ ఆవిష్కరణలకు కేంద్రంగా మారాలి” అని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, “డిగ్రీ మీకు వృత్తిని ఇస్తుంది, కానీ మీ వ్యక్తిత్వమే మీకు గౌరవాన్ని సంపాదిస్తుంది. సమాజానికి మీరు చేసే సేవే మీకు శాశ్వత వారసత్వాన్ని అందిస్తుంది” అని హితవు పలికారు. అంతకుముందు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బంగారు పతకాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ మదన్ లాల్ మీనా, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టీ.శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

# లంకె బిందల ఆశ...

## – అత్తామామల కోసం కూతురు, అల్లుడు ఆత్మహత్య

**హైదరాబాద్,(భారత శక్తి)** ఇంట్లో లంకెబిందెలు, గుప్తనిధులు ఉన్నాయంటూ ఓ సాధువు చెప్పిన మాటలను నమ్మిన అత్తమామలు.. తమ సొంత కూతురు, అల్లుడి ప్రాణాలనే బలితీసుకున్నారు. అల్లుడితో అప్పులు చేయించి.. ఆ తర్వాత మె?హం చాటేయటంతో మనస్థాపం చెందిన దంపతులు ప్రాణాలు తీసుకున్నారు. ఈ విషాదకర ఘటన హైదరాబాద్ శివారు మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మోకిల సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బాలసాయి, పద్మ ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన తర్వాత వారిద్దరూ సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు మండలం పటేల్‌గూడలో నివాసముంటూ జీవనం సాగించేవారు. వీరికి ఐదు నెలల బాబు కూడా ఉన్నాడు. అయితే.. పెళ్లయిన కొన్ని రోజులకు ఈ దంపతులు అత్తగారి ఇంటికి వెళ్లారు. అదే సమయంలో పద్మ తల్లిదండ్రులైన శాంతమ్మ, చంద్రయ్య, అలాగే తోడల్లుడు వెంకటేష్ కలిసి బాలసాయికి ఒక కథ చెప్పారు. తమ ఇంట్లో కోట్ల విలువైన నిధి దాగి ఉందని.. దాన్ని వెలికితీయడానికి ఒక సాధువు పూజలు చేయాలని అందుకు రూ.10 లక్షల నగదు అత్యవసరంగా కావాలని అల్లుడు బాలసాయిని నమ్మించారు. అత్తమామల మాటలను నిజమేనని నమ్మిన బాలసాయి.. నాలుగు నెలల క్రితం తనకు తెలిసిన వారి వద్ద వడ్డీలకు రూ.10 లక్షలు అప్పు తెచ్చి అత్తమామల చేతిలో పెట్టాడు. ఆ డబ్బుతో వారు ఇంట్లో రహస్యంగా తవ్వకాలు జరిపారు. అయితే ఎంత తవ్వినా ఎలాంటి నిధి దొరకలేదు. దీంతో సాధువు మోసం చేశాడని తెలిసినా అత్తమామలు ఆ విషయాన్ని దాచిపెట్టారు. ఇటు చూస్తే అప్పు ఇచ్చిన వారు బాలసాయిపై రోజురోజుకూ ఒత్తిడి పెంచడం ప్రారంభించారు. అటు వైపు అత్తమామల నుంచి ఎలాంటి స్పందన లేదు. అవమానాలు, వేధింపులు ఎక్కువ కావడంతో బాలసాయి తన అత్త, మామ, తోడల్లుడిని డబ్బులు తిరిగివ్వాలని కోరాడు. కానీ వారు నయాపైసా కూడా ఇవ్వకుండా చేతులెత్తేశారు. అప్పుల ఊబి నుంచి ఎలా బయటపడాలో దిక్కుతోచని స్థితిలో తీవ్ర మనస్తాపానికి గురైన బాలసాయి, పద్మ తమ ఐదు నెలల పసికందును చూసి కన్నీరుమున్నీరయ్యారు. చివరకు స్వగ్రామమైన జన్వాడకు వచ్చి ఇద్దరూ కలిసి జూన్ 28న బలవన్మరణానికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ‘అందరూ మమ్మల్ని క్షమించాలి. నేను, నా భార్య... మా అత్త, మామల మాటలు నమ్మి దారుణంగా మోసపోయాం.’ అని మెసేజ్ ఉండటంతో ఆ దిశగా దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు అత్త శాంతమ్మ, మామ చంద్రయ్య, తోడల్లుడు వెంకటేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దీంతో ఐదు నెలల చిన్నారి అనాథగా మారాడు.

# సంపాదకీయం

భారత శక్తి
VOICE OF INDIAN


## వ్యవసాయ సంక్షోభం తప్పదా


పసిఫిక్ మహాసముద్రంలో ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల సంభవించే ఎల్ నినో ప్రస్తుత వాతావరణాన్ని పూర్తిగా శాసిస్తోంది. వర్షాల కొరత నేరుగా ఖరీఫ్ సీజన్‌పై దెబ్బకొట్టబోతోంది. తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మిరప, వేరుశనగ సాగు చేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేయడానికి వెనుకంజ వేస్తున్నారు. కాలవర్షాలు కురవకపోతే పంట దిగుబడి గణనీయంగా పడిపోయి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నభిన్నమవుతుంది. దీని ప్రభావం మార్కెట్లపై పడి పప్పుధాన్యాలు, కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. పాలకులకు ఇది కేవలం వాతావరణ సమస్యే కాదు, ఆర్థిక సంక్షోభానికి దారితీసే ముప్పు కూడా. జూలై, ఆగస్టు నెలల్లో కూడా ఎల్ నినో ప్రభావం తీవ్రంగానే ఉండబోతోంది. కాబట్టి, అందుబాటులో ఉన్న కొద్దిపాటి జలవనరులను అత్యంత జాగ్రత్తగా మేనేజ్ చేయడం ఒక్కటే ప్రస్తుతానికి ఉన్న మార్గం.గత ఏడాది పడాల్సిన వర్షాలు ముందే కురిసి, శ్రీశైలానికి వరుసగా మూడు, నాలుగు నెలల పాటు రికార్డు స్థాయిలో ఇన్‌ఫ్లో తెచ్చిపెట్టాయి. కానీ ఈ ఏడాది పరిస్థితి పూర్తిగా తలకిందులైంది. నైరుతి రుతుపవనాల గమనం మందగించడంతో దేశంలోని సగానికి పైగా ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతోంది. వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం, ఈ సీజన్‌లో దేశవ్యాప్త సగటు వర్షపాతం లోటు భారీగా ఉండే ప్రమాదం ఉంది. ఇది దేశ ఆహార భద్రతపై నేరుగా ప్రభావం చూపనుంది.దక్షిణ భారతదేశంలో ఎల్ నినో ప్రభావం అత్యంత స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా జూన్ నాటికి నిండాల్సిన కర్ణాటక, కేరళ, తమిళనాడులోని ప్రధాన జలాశయాలు ఈసారి వెలవెలబోతున్నాయి. కావేరి, కృష్ణా బేసిన్లలో నీటి నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. దక్షిణాదిలోని ప్రధాన నగరాల్లో ఇప్పటికే తాగునీటి ఎద్దడి సంకేతాలు కనిపిస్తుండగా, విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన జలవనరులు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు సకాలంలో పడకపోతే అంతర్-రాష్ట్ర జల వివాదాలు మళ్లీ రాజుకునే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు జీవనాడి అయిన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకల నుంచి భారీగా వరద వస్తేనే ఈ డ్యామ్‌లు నిండుతాయి. అయితే ఎల్ నినో కారణంగా కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతాల్లో వర్షాలు మొహం చాటేశాయి. గత ఏడాది తరహాలో ఈసారి జలాశయాలు నిండుతాయా లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గోదావరి బేసిన్‌లోనూ ఇదే పరిస్థితి ఉండటంతో.. అటు రాయలసీమకు తాగునీరు, ఇటు కోస్తా, తెలంగాణ జిల్లాలకు సాగునీరు అందించడం ఉభయ రాష్ట్ర ప్రభుత్వాలకు సవాలుగా మారనుంది.ఎల్ నినో ప్రభావం కారణంగా దేశంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురిసే 315 జిల్లాలను కేంద్ర వ్యవసాయ శాఖ గుర్తించింది. ఈ జిల్లాలు కలిగిన ఆయా రాష్ట్రాలు తమ అత్యవసర ప్రణాళికలను అమలు చేయాలని ఆదేశించింది. ఈ 315 జిల్లాల్లో 25 శాతం కంటే తక్కువ సాగునీటి వసతి కలిగిన 111 జిల్లాలను అత్యంత ప్రమాదకమైన కేటగిరీగా గుర్తించారు. 25 నుంచి 50 శాతంలోపు సాగునీటి వసతి ఉన్న మరో 76 జిల్లాలను మధ్యస్థ ప్రమాదకర కేటగిరీలో చేర్చగా, 50 శాతం కంటే ఎక్కువ సాగునీటి సౌకర్యం ఉన్న 128 జిల్లాలను సాపేక్షంగా తక్కువ ముప్పు ఉన్న ప్రాంతాలుగా పరిగణించారు.అత్యంత ప్రమాదకర స్థితిలో ఉన్న జిల్లాలు ఎక్కువగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో కేంద్రీకృతమై ఉన్నాయి.

మిగిలిన జిల్లాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి. బలహీనమైన రుతుపవనాల ప్రభావాన్ని తట్టుకునేందుకు పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు, నూనె గింజల సాగువైపు రైతులను ప్రోత్సహించాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. పంటల వైవిధ్యం, తేమ సంరక్షణ, సమర్థవంతమైన నీటి యాజమాన్యం వంటి వ్యూహాలను అనుసరించాలని తెలిపింది.

చెరువుల మరమ్మతులు, చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణ, కాలువల్లో పూడికతీత, నీటి సంరక్షణ నిర్మాణాల విస్తరణ ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని బలోపేతం చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. మరోవైపు 2026 ద్వితీయార్థంలో ఎల్ నినో తీవ్ర రూపం దాల్చే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి వాతావరణ సంస్థ హెచ్చరించింది. 'సౌత్ ఏషియన్ ?క్లైమేట్ అవుట్ లుక్ ఫోరం' అంచనాల ప్రకారం భారతదేశంలో దీర్ఘకాలిక సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మాత్రమే కురిసే అవకాశం ఉంది. తీవ్రమైన ఉష్ణోగ్రతలు, నీటి ఎద్దడి కారణంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎల్ నినో వల్ల అనావృష్టి ఏర్పడి ఆహార ద్రవ్యోల్బణం పెరిగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది.


# జీహెచ్ఎంసీలో అధికారులే 'డీజిల్' దొంగలు..!








అడిషనల్ కమిషనర్ అడ్మిన్











**హైదరాబాద్, జూన్ 30: భారత శక్తి,** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ)లో పారిశుద్ధ్య వాహనాల నిర్వహణ పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతోంది. నగర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన పారిశుద్ధ్య వాహనాలు 'అవినీతి ఇంధనం'తో నడుస్తున్నాయనే నగ్నసత్యం తాజాగా వెలుగుచూసింది. జైల్ గార్డెన్ వర్క్‌షాప్ వేదికగా సాగుతున్న ఈ డీజిల్ దందాపై 'ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్' ఫిర్యాదుతో విజిలెన్స్ విచారణ ముమ్మరమవడంతో అవినీతి తిమింగలాల గుండెల్లో వణుకు మొదలైంది.

### నడవని బండ్లు.. ఎగిరిన నిధులు!

గత వారం రోజులుగా (జూన్ 22 నుండి జూన్ 29 వరకు) జైల్ గార్డెన్ వర్క్‌షాప్ పరిధిలోని పారిశుద్ధ్య వాహనాలకు డీజిల్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. ప్రైవేట్ పెట్రోల్ బంకులకు ఇవ్వాల్సిన పాత బాకీలు పేరుకుపోవడంతో సదరు యజమానులు చేతులెత్తేయడమే దీనికి కారణం. ఫలితంగా వందలాది పారిశుద్ధ్య వాహనాలు షెడ్లకే పరిమితమయ్యాయి. నగరంలో చెత్త పేరుకుపోయింది.
కానీ, ఇక్కడే అసలు ట్విస్ట్ ఉంది! క్షేత్రస్థాయిలో వాహనాలు కదలకున్నా, తెరవెనుక మాత్రం డీజిల్ బిల్లులు చకచకా తయారైపోయినట్లు సమాచారం. బండ్లు నడవకపోయినా.. నడిచినట్లు చూపిస్తూ, దొంగ బిల్లులు సృష్టించి ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసేందుకు ముఠా సిద్ధమైంది.

### ఆ రెండు పెట్రోల్ బంకులే టార్గెట్!

ఈ భారీ కుంభకోణంలో ప్రైవేట్ పెట్రోల్ బంకుల పాత్రపై తీవ్ర నిఘా వ్యూహం అమలవుతోంది. ముఖ్యంగా:
దెక్కన్ పెట్రోలియమ్స్
ఎమ్.ఎ. రహ్మాన్ పెట్రోల్ బంక్
ఈ రెండు బంకుల యాజమాన్యాలు, జీహెచ్ఎంసీలోని కొంతమంది ఉన్నతాధికారులతో చేతులు కలిపి నకిలీ ఇన్వాయిసులు, తప్పుడు లావాదేవీలతో కోట్ల రూపాయల నిధులను లూటీ చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత మూడేళ్లుగా.. అంటే ఏడాదికి 365 రోజులూ విరామం లేకుండా డీజిల్ సరఫరా చేసినట్లు చూపించి, నిధులు డ్రా చేసుకున్నట్లు గట్టి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగితాల్లో ట్రిప్పులు వేసి, ఖజానాను ఖాళీ చేసిన ఈ పెట్రోల్ బంకుల లైసెన్సులను రద్దు చేసి, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ ఊపందుకుంది.

### కావడిగూడ టు జైల్ గార్డెన్.. అంతటా అవినీతి నెట్‌వర్క్!

ఇటీవలే కావడిగూడ వర్క్‌షాప్‌లో డీజిల్, విడిభాగాల (స్పేర్ పార్ట్స్) పేరిట జరిగిన దోపిడీపై కథనాలు రాగా, ఇప్పుడు జైల్ గార్డెన్ వ్యవహారం జీహెచ్ఎంసీ పరువును బజారున పడేసింది. ఈ రెండు వర్క్‌షాపుల వెనుక ఒకే అవినీతి నెట్‌వర్క్ పనిచేస్తోందని, ఉన్నతాధికారుల అండదండలు లేనిదే ఇంత పెద్ద మొత్తంలో దోపిడీ సాధ్యం కాదని కార్పొరేషన్ వర్గాలే గుసగుసలాడుకుంటున్నాయి.

### సమగ్ర ఆడిట్ జరగాల్సిందే: విజిలెన్స్ యాక్షన్ ప్లాన్

ప్రజల పన్నుల సొమ్మును కొల్లగొడుతున్న ఈ ముఠా ఆట కట్టించేందుకు కింది చర్యలు తక్షణమే చేపట్టాలని విజిలెన్స్ బృందాలు రంగంలోకి దిగుతున్నాయి:

1. లాగ్‌బుక్, జీపీఎస్ క్రాస్ వెరిఫికేషన్: వాహనాలు తిరిగినట్లు జీపీఎస్ (GPS) రికార్డుల్లో ఉందా? లేదా? అనే అంశాన్ని, డీజిల్ ఇష్యూ రిజిస్టర్లతో పోల్చి చూడాలి.
2. స్పెషల్ ఆడిట్: గత మూడేళ్ల కాలానికి సంబంధించిన ప్రతి బిల్లును, ప్రతి ట్రిప్ వివరాలను నిష్పాక్షికంగా ఆడిట్ చేయాలి.
3. ఖాతాల సీజ్: అవినీతికి పాల్పడిన ప్రైవేట్ పెట్రోల్ బంకుల బ్యాంకు ఖాతాలను, జీహెచ్ఎంసీ రికార్డులను తక్షణమే సీజ్ చేయాలి.

### ప్రభుత్వ బంకుల ద్వారానే సరఫరా చేయాలి!

ప్రైవేట్ బంకుల యజమానుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే, ఇకపై జీహెచ్ఎంసీ వాహనాలకు ప్రైవేట్ బంకుల నుండి కాకుండా, ప్రభుత్వ రంగ చమురు సంస్థల అధీకృత ఇంధన కేంద్రాల (Government Fuel Outlets) ద్వారా మాత్రమే డీజిల్ సరఫరా చేయాలనే డిమాండ్ వస్తోంది.

అలాగే జీపీఎస్ ఆధారిత ఫ్యూయల్ మానిటరింగ్ సిస్టమ్, డిజిటల్ బిల్లింగ్ విధానాన్ని ప్రవేశపెడితేనే ఈ లూటీకి శాశ్వత పరిష్కారం దొరుకుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.మరి ఈ మెగా డీజిల్ స్కామ్‌పై జీహెచ్ఎంసీ కమిషనర్ ఎంత కఠినంగా వ్యవహరిస్తారో? అవినీతి బంకుల యజమానులను, సూత్రధారులైన అధికారులను జైలుకు పంపుతారో లేదో చూడాలి!

# హయత్‌నగర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శ్రీమతి పి.ఇందిర పదవీ విరమణ అభినందన సభ..

- హాజరైన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,
- కార్పోరేషన్ ఛైర్మన్స్ మల్‌రెడ్డి రాంరెడ్డి, గుత్తా అమిత్ రెడ్డి ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఐఏఎస్.

**ఎల్బీనగర్, జూన్ 30 (భారత శక్తి):**హయత్‌నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సుదీర్ఘకాలం విద్యా సేవలందించి పదవీ విరమణ పొందిన శ్రీమతి పుచ్చకాయల ఇందిర పదవీ విరమణ అభినందన సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఛైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఐఏఎస్ ముఖ్య అతిథులుగా హాజరై శ్రీమతి ఇందిరని ఘనంగా సన్మానించి, విద్యా రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమె చేసిన కృషి ఆదర్శప్రాయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేయడాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకుని, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టితో ముందుకు సాగుతున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆరుట్లలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ముఖ్యమంత్రి ఇటీవల ప్రారంభించారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అత్యాధునిక మౌలిక వసతులు, డిజిటల్ తరగతి గదులు, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడా సదుపాయాలు, విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.ఈ క్రమంలో రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో అత్యాధునిక వసతులతో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్" ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలలు భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి విద్యను అందించే కేంద్రాలుగా నిలుస్తాయని, తొలి విడత పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో మరిన్ని పాఠశాలలను ప్రారంభించి ప్రభుత్వ విద్యను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉపాధ్యాయులే సమాజ నిర్మాణ శిల్పులని, వారి కృషి వల్లే ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని కొనియాడారు. సుదీర్ఘకాలం అంకితభావంతో విద్యా సేవలందించిన శ్రీమతి పుచ్చకాయల ఇందిర సేవలు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, పదవీ విరమణ అనంతరం కూడా తమ అనుభవంతో సమాజానికి మార్గదర్శకత్వం అందించాలని ఆకాంక్షించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి రాష్ట్రానికి, దేశానికి మంచి పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి డిఈఓ సుశీంద్ర రావు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేంకటేశ్వర్లు, గోవర్ధన్ రెడ్డి, ఇంచార్జ్ హెడ్ మిస్ట్రెస్ రమాదేవి కాంగ్రెస్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు గుర్రం శ్రీనివాస్ రెడ్డి







హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెగావత్ గణేష్ నాయక్, నక్క శ్రీనివాస్, మతిన్ షరీఫ్, సోలిపురం వెంకట్రామ్ రెడ్డి, కొండోజు శ్రీనివాస్ తదితరులు పాల్గొని శ్రీమతి ఇందిరకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రశ్నిస్తే కేసులు పెడతారా

## మున్సిపల్ మేయర్, మున్సిపల్ కమిషనర్లపై సీపీకి ఫిర్యాదు



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30 (భారతశక్తి): మంచిర్యాల నగర మున్సిపల్ మేయర్ ధరణి మధుకర్,మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు మంగళవారం రామగుండం పోలీస్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బిజెపి కార్పొరేటర్ నాగరాజు మాట్లాడుతూ సోమవారం రోజున మున్సిపల్ నగర కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని సజావుగా నిర్వహించకుండా హక్కులను కాల రాస్తున్నారని, ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని అని అన్నారు. ప్రజాధనం దుర్వినియోగంపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు తమకు లేదా అని అన్నారు.

# అభివృద్ధిని తొక్కిపెట్టడమే బీజేపీ నైజమా

## - కౌన్సిల్ హాల్‌లో బీజేపీ కార్పొరేటర్ల రభస సిగ్గుచేటు
## - మేయర్ ధరణి మధుకర్



మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30 (భారతశక్తి): మంచిర్యాల నియోజకవర్గంలో విద్య, వైద్యం తో పాటు నగర అభివృద్ధిని బీజేపీ నాయకులు,కార్పొరేటర్లు ఓర్వలేకపోతున్నారని అందుకనే మున్సిపల్ అజెండా పూర్తి కాకముందు బైకాట్ చేసి గొడవ సృష్టించారని మేయర్ అన్నారు. మంగళవారం రోజు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు కాలేజ్ రోడ్ లోని మహాప్రస్థానంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మేయర్ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా విద్య, వైద్యం తో పాటు నగర అభివృద్ధిని బీజేపీ నాయకులు,కార్పొరేటర్లు ఓర్వలేకపోతున్నారని అందుకనే మున్సిపల్ అజెండా పూర్తి కాకముందు బైకాట్ చేసి గొడవ సృష్టించారని,కాలేజీ రోడ్డులోని మహా ప్రస్థానంలో దోపిడి జరుగుతుందని తప్పుడు ఆరోపణ చేసిన బీజేపీ నాయకులు తక్షణమే ఎమ్మెల్యే కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ సమావేశంలో బిజెపి కార్పొరేటర్ లు అనుసరించిన తీరు సమంజసం కాదన్నారు.అన్ని డివిజన్ల సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించామని గుర్తు చేశారు.స్వార్థ పూరిత ఆలోచనలతో అనుకూలమైన బిజెపి నాయకుల ఏరియాలో నిధులు కేటాయించాలని కోరారని, వారి డివిజన్లో ప్రధాన సమస్యలను గుర్తించి పనులకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.కార్పొరేటర్ ముఖేష్ గౌడ్ గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గా,కౌన్సిలర్ గా బాధ్యతలు నిర్వహించారని గుర్తుచేస్తూ వారి హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణకు సిద్ధమన్నారు. ప్రజాధనాన్ని దోచుకొని ఇప్పుడు ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని సహించలేక అసత్య ఆరోపణలు, ఉద్దేశ పూర్వకంగా ఆందోళన కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు.బిజెపి జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ రాజకీయ స్వార్ధ ఆలోచనలతో కార్పొరేటర్ ను అడ్డుపెట్టుకొని నాటకాలు ఆడుతున్నట్లు మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో

# కొనసాగుతున్న రిలే దీక్షలు

## నాలుగవ రోజు మద్దతిచ్చిన అనేక మంది ప్రముఖులు




భారత శక్తి, జూన్ 30 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థాన కొండపైన ఉన్న వర్తక సంఘాన్ని రద్దు చేసి నూతన టెండర్లు వేయాలని కోరుతూ స్థానిక యువత, నిరుద్యోగులు యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరహార దీక్ష నాలుగవ రోజుకు చేరింది. రోజురోజుకు పరిసర గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకుల మద్దతుతో పరిరక్షణ కమిటీ నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం రోజు పరిరక్షణ కమిటీ నాయకులు బండ రామస్వామి, దండబోయిన వీరేష్, మిర్యాల కృష్ణ, మందోజు నరేష్, బండి అనిల్ లు దీక్షలో కూర్చోగా వారికి మద్దతుగా కాటబత్తిని ఆంజనేయులు, సుడుగు జీవన్ రెడ్డి, పల్లపు బాలయ్య, కల్వకొలను సతీష్ భట్, దొమ్మాట ప్రభాకర్, ఆరె స్వామి, కర్రె ప్రవీణ్, బుగ్గ ఆంజనేయులు, పసుపునుటి మురళి, బండి వాసు, ముక్కెర్ల వెంకటేష్, గ్యాదపాక క్రాంతి, పలుగుల సురేష్, శ్రీనాధ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# పీఎంజేజేబీవై పథకం కింద రూ.2 లక్షల బీమా చెక్కు అందజేత

## మృతుడి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించిన బీమా పథకం



జగిత్యాల, జూన్ 30 (భారత్ శక్తి ప్రతినిధి): ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై) పథకం కింద రాయపట్నం గ్రామానికి చెందిన రాందేని లక్ష్మణ్ ఇటీవల మృతి చెందగా, ఆయన కేడీసీసీ బ్యాంకు ధర్మపురి శాఖ ద్వారా పథకంలో నమోదు చేసుకున్నందున బీమా క్లెయిమ్ కింద రూ. 2 లక్షల చెక్కును ఆయన భార్య రాందేని సత్తవ్వకు మంగళవారం అందజేశారు. కేడీసీసీ బ్యాంకు డీజీఎం ఎన్. సత్యప్రసాద్, శాఖ మేనేజర్ ఎం. శ్రీలక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ బి. చంద్రశేఖర్ రెడ్డి సంయుక్తంగా చెక్కును లబ్ధిదారురాలికి అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక భద్రతా బీమా పథకాలలో ప్రతి అర్హుడు నమోదు చేసుకుని ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు అధికారులు సూచించారు.

# ప్రమాణ స్వీకారం చేసిన లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం






మణుగూరు, జూన్ 30 (భారతశక్తి): లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు 2026-27 నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి అంబేద్కర్ సెంటర్ లో గల డివి ఫంక్షన్ హాల్ లో మాజీ అధ్యక్షుడు లయన్ డాక్టర్ షేక్ మీరా హుస్సేన్ అధ్యక్షతన అట్టహాసంగా జరిగింది. లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు 32వ ప్రమాణ స్వీకారోత్సవంలో అధ్యక్షులుగా లయన్ దొబ్బల వెంకటప్పయ్య, సెక్రటరీ లయన్ కత్తి రాము, ట్రెజరర్ లయన్ మేదరమట్ల యాదగిరిల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఇన్స్టాలేషన్ ఆఫీసర్ లయన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఇండక్షన్ ఆఫీసర్ లయన్ ఎం ప్రభాకర్ రెడ్డి, లయన్ ఎడవల్లి కృష్ణ లయన్ లగడపాటి ప్రభాకర్ చేతులమీదుగా గ్యాంగ్ అండ్ గ్రావెల్ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాయం వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ.. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన లైన్స్ క్లబ్ మణుగూరు ప్రెసిడెంట్ లయన్ దొబ్బల వెంకటప్పయ్య ప్రజాసేవలో ఎన్నో సంవత్సరాల నుండి ఉన్నారని, పాత మణుగూరు గ్రామపంచాయితీ సర్పంచ్ గా పనిచేసి మణుగూరు ప్రాంత ప్రజల అభిమానాన్ని చూర గోన్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో లైన్స్ క్లబ్ మణుగూరు గత 31 సంవత్సరాలుగా ఎన్నో సామాజిక చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలిచిందని కొనియాడారు. స్వార్థం లేని నిస్వార్ధమైన సేవకు లయన్స్ క్లబ్ సభ్యులు నిదర్శనమన్నారు. జీవితంలో చివరికి మిగిలే సేవ ఆత్మ సంతృప్తిని కలిగిస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ద్వారా మరెన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమితి సింగారం ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు మెంబర్స్, జోన్ చైర్ పర్సన్ మొత్తం శెట్టి నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ మగువ ప్రెసిడెంట్ వనం నాగదేవి, లయన్స్ క్లబ్ అశ్వాపురం స్టార్స్ ప్రెసిడెంట్, డెసిగ్నేటివ్ జోన్ చైర్ పర్సన్ నల్లగట్ల సత్య ప్రకాష్, ప్రోగ్రాం చైర్ పర్సన్స్ గాజుల రమేష్ కుమార్, కముజు చంద్రమోహన్ చింతపల్లి రాంబాబు, సెక్రటరీ ఎం శ్రీనివాసరావు ట్రెజరర్ ఆడబాల నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ సభ్యులు దుగ్గి సతీష్ జాయింట్ సెక్రెటరీ ఎల్లారెడ్డి, డాక్టర్ దుస్సా సమ్మయ్య, గాజుల పూర్ణచంద్రరావు, డాక్టర్ గాజుల కోటేశ్వరరావు, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ శశిధర్, మేదరమేట్ల లక్ష్మీ, బండారు వాణి, వాసవి క్లబ్ సభ్యులు, పుర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్భయంగా చదువుకోండి.. మేమున్నాం అంటున్న షీ టీమ్స్

- మహిళలు,బాలికలు వేధింపులను సహించొద్దు వెంటనే షీ టీమ్‌ను ఆశ్రయించండి
- సరైన నిర్ణయాల కోసం అవసరమైనప్పుడు ధైర్యంగా “నో” చెప్పడం నేర్చుకోవాలి
- మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్





మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30( భారత శక్తి): రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లోని మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ ఉషారాణి ఆధ్వర్యంలో షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ, మహిళలు, విద్యార్థినుల భద్రత, ఆత్మవిశ్వాసం, గౌరవాన్ని పరిరక్షించడమే షీ టీమ్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే భయపడాల్సిన అవసరం లేదని, కేసు నమోదు చేస్తే భవిష్యత్తు దెబ్బతింటుందనే అపోహలను విడిచిపెట్టాలని సూచించారు. మహిళలు, విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా షీ టీమ్ దృష్టికి తీసుకురావాలని కోరారు.షీ టీమ్‌కు ఫిర్యాదు అందిన వెంటనే సభ్యులు బాధితురాలిని గోప్యంగా సంప్రదించి సమస్యను తెలుసుకుని, అవసరమైన విచారణ నిర్వహించి, తప్పు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.సామాజిక మాధ్యమాలు,ఫోన్ కాల్స్,సందేశాలు లేదా ప్రత్యక్షంగా ఎలాంటి వేధింపులు ఎదురైనా వాటిని సహించకుండా వెంటనే షీ టీమ్‌ను సంప్రదించాలని సూచించారు. “పోనీలే” అనే భావనతో వేధింపులను భరిస్తే అవి మరింత పెరిగే అవకాశం ఉంటుందని, అందువల్ల ఎట్టి పరిస్థితుల్లోనూ మౌనంగా ఉండవద్దని విద్యార్థినులకు సూచించారు. విద్యాసంస్థలు, వసతి గృహాలు,నివాస ప్రాంతాలు,ఉద్యోగ ప్రదేశాలు లేదా ప్రయాణ సమయంలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా షీ టీమ్ సహాయం తీసుకోవాలని, మహిళల భద్రత కోసం షీ టీమ్ 24 గంటలూ పనిచేసే ప్రత్యేక పోలీసు విభాగమని తెలిపారు.ప్రతి విద్యార్థిని తన సమస్యను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా షీ టీమ్‌తో వెంటనే పంచుకోవాలని, సమస్యలను దాచిపెట్టకుండా ధైర్యంగా ముందుకు వస్తే పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే అవసరమైనప్పుడు ధైర్యంగా”నో” (చీశీ) చెప్పడం నేర్చుకోవాలని డీసీపీ సూచించారు. ప్రతి విషయానికీ “ఎస్” (వం) చెప్పడం కంటే, తమకు ఇష్టం లేని, భవిష్యత్తుకు హాని కలిగించే విషయాలను ధైర్యంగా తిరస్కరించే వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే”నో” చెప్పే ధైర్యాన్ని పెంపొందించాలని, జీవితంలో అనేక సమస్యలకు మూల కారణం ఇష్టం లేకపోయినా తిరస్కరించలేకపోవడమేనని వివరించారు.అంతేకాక ఇతరులను చూసి చదువులు లేదా వృత్తులను ఎంచుకోవడం కంటే, తమ ఆసక్తులు, ప్రతిభ,సామర్థ్యాలను గుర్తించి వాటికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు.ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ ఉంటుందని,ఆ ప్రతిభను గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.భవిష్యత్తులో చదువు,ఉద్యోగం, వ్యక్తిగత జీవితంలో ఎదురయ్యే ఒత్తిడులు,ప్రలోభాల మధ్య సరైన నిర్ణయాలు తీసుకునేందుకు విశ్లేషణాత్మక ఆలోచనతో పాటు అవసరమైనప్పుడు “నో” చెప్పగల ధైర్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సమస్యలను చూసి భయపడకుండా, ముందుగా వాటిని సరిగా అర్థం చేసుకుని,వాటి మూల కారణాన్ని గుర్తిస్తే పరిష్కారం సులభంగా దొరుకుతుందని తెలిపారు.గణిత సమస్యను పరిష్కరించినట్లే జీవితంలోని ప్రతి సమస్యను ప్రశాంతంగా విశ్లేషించి, సరైన ప్రణాళికతో ముందుకు సాగితే ఏ సవాలునైనా అధిగమించవచ్చని డీసీపీ భాస్కర్ విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్ఐ ఉషారాణి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అనూష, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ‘సేవ్ మణుగూరు’ స్వచ్ఛంధంగా పట్టణ బంద్

- పీకేఓసి డీప్ సైడ్ బ్లాక్ సింగరేణికి కేటాయించాలి.
- మణుగూరు ఓసికి అనుమతులు మంజూరు చేయాలి.
- అఖిలపక్షం డిమాండ్






మణుగూరు జూన్ 30 (భారతశక్తి): ‘సేవ్ మణుగూరు’ అంటూ మణుగూరు అఖిలపక్ష పార్టీలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం మణుగూరు పట్టణ బంద్ విజయవంతం జరిగిందని తెలిపారు. ముందుగా మణుగూరు పట్టణంలో అఖిలపక్ష పార్టీల నాయకులు బైక్ ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్లో జరిగిన సమావేశంలో దుర్గ్యాల సుధాకర్ (సిపిఐ) వాసిరెడ్డి చలపతిరావు (టిడిపి), రూపురెడ్డి మధుసూదన్ రెడ్డి సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్) నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటికైనా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గుర్తించి మణుగూరు పీకేఓసి డిప్ సైడ్ బ్లాక్ ను ప్రైవేట్ పరం చేయకుండా సింగరేణికి కేటాయించాలని, మణుగూరు ఓసి ఎక్స్టెన్షన్ తీసుకురావాలని డిమాండ్ చేశారు. అఖిలపక్ష పార్టీలు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కార్మిక సంఘాలు ఇచ్చిన సేవ్ మణుగూరు బంద్ విజయవంతం జరిగిందన్నారు. ప్రవేట్ విద్యాసంస్థలు, వ్యాపారస్తులు, చిరు వ్యాపారస్తులు, పెట్రోలు బంకులు, సినిమా హాల్స్, బులియన్ మర్చంట్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ స్వచ్ఛంధంగా బంద్ ప్రకటించారు. నేడు సింగరేణి మణుగూరులో కేవలం రెండు బావులే నడుస్తున్నాయని పీకేఓసి డిప్ సైడ్ బ్లాక్ ను ప్రవేట్ పరం చేయకుండా సింగరేణికే అప్ప చెప్పాలని, మణుగూరు ఓసి అనుమతులు తీసుకురావాలని, అప్పుడే సింగరేణి కార్మికులు, మణుగూరు ప్రాంతం అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ ప్రాంతంలో సింగరేణికి 25 సంవత్సరాలకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నామని వారు తెలియజేశారు. కార్మిక సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు కలుపుకొని ‘సేవ్ మణుగూరు’ అంటూ జరుగుతున్నటువంటి ఈ ఆందోళనకు సహకరించిన చాంబర్ ఆఫ్ కామర్స్, వర్తక వ్యాపారస్తులు, బులియన్ మర్చంట్ అసోసియేషన్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్, జనరల్ మెడికల్ స్టోర్ అసోసియేషన్, కిరాణా స్టోర్ అసోసియేషన్, కూరగాయల మార్కెట్ అసోసియేషన్, ఫ్యాన్సీ జనరల్ స్టోర్ అసోసియేషన్, చికెన్ అండ్ మటన్ మార్కెట్ అసోసియేషన్, విద్యాసంస్థలు, హోటల్స్, పట్టణ పుర ప్రముఖులు అన్ని వర్గాల ప్రజలు సహకరించి బందు విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. ఈ పట్టణ బంద్ తో పాటు సంఘీభావంగా పి.వీ .కాలనీలో కూడా అన్ని షాపులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మీకుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సుజాత, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి మద్దెల భద్రయ్య, పట్టణ అధ్యక్షులు తాటి పూర్ణచంద్రరావు, రాజా, ఆంజనేయులు, జంపాల యాకయ్య సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్ )మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు కన్నీరు.. పాలకుల నిర్వేదం!

- వడ్ల కుంభకోణం నెపం వారిది.. శిక్ష మాత్రం అన్నదాతకా? - ఆరుగాలం శ్రమించిన పంట సొమ్ముకు బ్రేక్..
- జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని రైతాంగం ఆగ్రహం!

భారత శక్తి న్యూస్,రాజన్న సిరిసిల్ల, జూన్ 30: భూమిని నమ్ముకుని, చెమటోడ్చి, రాత్రింబవళ్లు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకున్న రైతుకు చివరకు మిగిలింది కన్నీరే. జిల్లాలో జరిగిన వడ్ల కుంభకోణానికి, అమాయక రైతులకు ఏం సంబంధం? తప్పు చేసింది కొందరు అధికారులు, మధ్యవర్తులైతే.. దానికి శిక్ష మాత్రం అన్నదాతలకు వేస్తారా? అంటూ జిల్లా వ్యాప్తంగా రైతాంగం తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తం చేస్తోంది. కుంభకోణం పేరుతో మొదట కొన్ని రోజులు కాలయాపన చేశారు. ఆ తర్వాత ట్యాబ్‌లను డిసేబుల్ చేశామంటూ సాంకేతిక కారణాలను సాకుగా చూపారు. తాజాగా నూతన కమిటీని వేసినప్పటికీ.. అడుగు ముందుకు పడలేదు, రైతుల ఖాతాల్లోకి పైసా చేరలేదు. ఇదెక్కడి న్యాయం?

### సాకుల వేటలో అధికారులు..

### ఆకలి కేకల్లో రైతులు!

కుంభకోణం జరిగిందని గగ్గోలు పెట్టిన జిల్లా యంత్రాంగం, ఆ సాకుతో అసలైన రైతుల పొట్టగొట్టడం ఎంతవరకు సమంజసం? రోజులు గడుస్తున్నా, కమిటీలు వేసిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాకపోవడం వెనుక అధికారుల నిర్లక్ష్యం సుస్పష్టంగా కనిపిస్తోంది. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతులు, ఇప్పుడు వడ్డీలు కట్టలేక, కుటుంబ పోషణ భారమై తీవ్ర నిరాశలో, మానసిక వేదనలో కొట్టుమిట్టాడుతున్నారు.. రైతును ఇబ్బంది పెట్టిన ఏ ప్రభుత్వమైనా, ఏ అధికారైనా కాలగర్భంలో కలిసిపోక తప్పదని అన్నదాతలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. కాలయాపన ఆపి, యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి రైతుల ఖాతాల్లోకి వెంటనే డబ్బులు జమ చేయాలి. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా రైతాంగ ఆగ్రహ జ్వాలలు తప్పవని స్పష్టం చేస్తున్నారు.

# పేదింటి మహిళలకు కళ్యాణ లక్ష్మి- షాదీ ముబారక్ కొండంత భరోసా భరోసా

**మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్వర్ రెడ్డి**



సూర్యాపేట (భారత శక్తి ప్రతినిధి) జూన్ 30 రాష్ట్ర ప్రభుత్వం పేదింటి అడబిడ్డల కుటుంబాలకు అందించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పేదింటి మహిళలు సద్వినియోగపరుచుకోవాలని సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్ పహాడ్, సూర్యాపేట అర్బన్ రూరల్ మండలాలకు చెందిన 150 మంది లబ్ధిదారులకు రూ.1,50,17,400 కోట్ల విలువైన కల్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు జగదీష్ రెడ్డి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డలకు కొండంత భరోసా ఇస్తున్నాయని వీటిని ప్రతి ఒక్క పేదింటి మహిళ సద్వినియోగపరుచుకోవాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణరెడ్డి, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవరావు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాలకు భక్తులకు మెరుగైన సౌకర్యాలే లక్ష్యం

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



జగిత్యాల, జూన్ 30 (భారత్ శక్తి): 2027 గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం ధర్మపురి గోదావరి తీరంలో కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలిసి పుష్కరాల ఏర్పాట్లపై ఆయన పరిశీలించారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.1,000 కోట్లు కేటాయించగా, అందులో ధర్మపురి నియోజకవర్గానికి రూ.117 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. తాగునీరు, డ్రెస్సింగ్ రూములు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య ఏర్పాట్లపై సమగ్ర నివేదిక ఆధారంగా అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, వేముల రాజు, ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ప్రశాంత్, వోజ్జల లక్ష్మణ్, జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ఆహార పదార్థాల తయారీదారులపై కఠినంగా వ్యవహరించాలి

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (భారత శక్తి )జిల్లాలోని ఆహార పదార్థాలు దుకాణదారులంతా ఖచ్చితంగా నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆహార భద్రతపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని రెస్టారెంట్లు, హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, మిఠాయి దుకాణాలు, దాబాలు, ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల నిర్వాహకులు ఆహార భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని అన్నారు. వంటల తయారీలో ఉపయోగించే నూనెలు, మసాలా దినుసులు, పాలు, పెరుగు తదితర ముడి పదార్థాలు నాణ్యమైనవే వినియోగించాలని అన్నారు. ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ, దుకాణాల లైసెన్సులు సరి చూడాలని పేర్కొన్నారు.

ముడి పదార్థాల గడువు తేదీలను, లేబుళ్లను ఎప్పటికప్పుడు చూడాలన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించినా, ఫుడ్ కలర్లను వాడినా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, కోడిగుడ్లు, పాలు, పాల పదార్థాలు, మాంసం వంటి ఆహార పదార్థాలు తాజావే వాడుతున్నారో లేదో చూడాలని చెప్పారు. అపరిశుభ్రమైన, గడువు ముగిసిన లేదా నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయించినా, దుకాణాల్లో నిల్వ ఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహార పదార్థాల విక్రయ కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు అమలవుతున్నాయో లేదో నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం, ఇటీవలి ఫుడ్ సేఫ్టీ అంశం మీద శిక్షణ పొందిన పలువురు అంగన్వాడి టీచర్లకు కలెక్టర్, అధికారులు సర్టిఫికెట్లను అందించారు.

ఈ సమావేశంలో జిల్లా ఆహార భద్రత అధికారి సునీత, వైద్యారోగ్య అధికారి రాజేందర్, డిడబ్ల్యూవో వినూత్న, డిపివో శ్రీనివాస్, డిఈఓ భోజన్న, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మానవతా మూర్తి పెద్ది శంకర్ సేవలు అభినందనీయం

- **త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి.**
- **ఎల్బీనగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కదలీఫల అలంకరణ..**
- **రెడీ టూ సర్వ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌కు జీయర్ స్వామి ఆర్థిక సాయం**

హైదరాబాద్: జూన్30: భారత శక్తి, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలో మంగళవారం ఆధ్యాత్మిక చైతన్యం, మానవతా దృక్పథం మేళవించిన అరుదైన ఘట్టాలు ఆవిష్కృతమయ్యాయి. సరస్వతి నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో జరిగిన విశేష పూజలు, అలాగే ప్రముఖ సామాజిక కార్యకర్త పెద్ది శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలో జరిగిన సేవా కార్యక్రమాల్లో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పాల్గొని భక్తులకు, నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు.



**- పెద్ది శంకర్ సేవా నిరతికి జీయర్ స్వామి అభినందనలు**

ఆలయ కార్యక్రమం అనంతరం, జీయర్ స్వామి 'రెడీ టూ సర్వ్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో పెద్ది శంకర్ నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పెద్ది శంకర్ స్వామివారికి ఘన స్వాగతం పలికారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న స్వామివారు.. వృద్ధులకు అండగా నిలుస్తున్న పెద్ది శంకర్ సేవా భావాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఆశ్రమ నిర్వహణ కోసం తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేసి ఉదారత చాటుకున్నారు. "సమాజంలో వృద్ధులను ఆదరించడం, వారికి ఒక కొడుకులా సేవ చేయడం అన్నింటికంటే మిన్నయైన మానవ ధర్మం. పెద్ది శంకర్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలి."

**త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి**

నెరవేరనున్న సొంత స్థలం కల: పెద్ది శంకర్ ధీమా

ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పెద్ది శంకర్ మాట్లాడుతూ.. జీయర్ స్వామివారి పావన చరణాల స్పర్శతో తమ ఆశ్రమం పావనమైందని ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారి ఆశీస్సులతో ఓల్డ్ ఏజ్ హోమ్‌కు సొంత స్థలాన్ని సమకూర్చుకోవాలనే తమ చిరకాల వాంఛ త్వరలోనే సాకారం కానుందనే గట్టి నమ్మకాన్ని ఆయన వ్యక్తపరిచారు.

**- కన్నులపండువగా 'కదలీఫల అలంకరణ**



అంతకుముందు, సరస్వతి నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కదలీఫల (అరటిపండ్ల) అలంకరణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు విచ్చేసిన అహోబిల రామానుజ జీయర్ స్వామి.. హనుమంతునికి అలంకరించిన ఫలాలను భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అనంతరం జరిగిన సత్సంగంలో ఆయన 'హనుమద్వైభవం'పై అనుగ్రహ భాషణం చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు జీడికంటి ప్రద్యుమ్నాచార్యులు, అర్చకులు అనిరుద్ ఆచార్య, నీరజ్ పాల్గొని శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు విడియాల కేశవులు, ధర్మారావు, మురళి గౌడ్, విజయ్ భాస్కర్, శేఖర్ రెడ్డి సహా కాలనీవాసులు పాల్గొన్నారు. ఈ మొత్తం సేవా కార్యక్రమంలో ప్రథ్యం శర్మ, అనిరుద్, శ్రీధర్ శర్మ, నాగ మోహన్ శర్మ, సుభాషిని, శ్రీ పాత్, నాగరాజు గౌడ్, శ్రీ విజయ గౌడ్, రేణుక ప్రకాష్, నవీన్, బాలకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొని ఆశ్రమవాసులకు సేవలు అందించారు. జీయర్ స్వామి పర్యటనతో అటు భక్తులలో ఆధ్యాత్మిక ఆనందం, ఇటు పెద్ది

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

**ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటైన విద్య అందించాలి**

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలి -జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (భారత శక్తి)జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం లోకేశ్వరం మండలంలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రి, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియతో పాటు ఆయిల్ పామ్ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, రోజువారీ ఓపీ వివరాలు, మందుల లభ్యత, మౌలిక వసతులపై ఆరా తీశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన రోగులను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు వెంటనే రిఫర్ చేయాలని సూచించారు. చికిత్స కోసం వచ్చే ప్రతి రోగికి అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని, వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.అనంతరం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించిన కలెక్టర్, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా నాణ్యమైన విద్య అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలు, సృజనాత్మకత, చదువుపై ఆసక్తి పెంపొందేలా వినూత్న బోధనా విధానాలు అమలు చేయాలని సూచించారు. పలువురు విద్యార్థులతో మమేకమై వారి విద్యా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల రైతు వేదికలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను సమీక్షించారు. మండలంలోని మొత్తం రైతుల సంఖ్య, పూర్తయిన నమోదు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇంకా నమోదు చేసుకోని రైతులను గుర్తించి వారితో వ్యక్తిగతంగా సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులతో మాట్లాడిన కలెక్టర్, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం స్థానిక రైతు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను సందర్శించి పంట సాగు విధానం, దిగుబడి, మార్కెట్ అవకాశాలపై రైతుతో చర్చించారు. భవిష్యత్‌లో అధిక ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి రాజేందర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, తహసీల్దార్ సూర్యారావు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 35 సంవత్సరాల సుదీర్ఘ పదవీ కాలం తదుపరి విరామం.

**- ఆయన అలుపెరుగని జీవన విధానం తన విధి నిర్వహణకు పెట్టుబడి.**




హైదరాబాద్, భారత శక్తి ప్రతినిధి, జూన్ 30:మంగళవారం అధికారులు మరియు సిబ్బంది పి. అమరేందర్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ (డ్రాయింగ్)ని పదవీ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఆయన సౌత్ సెంట్రల్ రైల్వేలో 35 సంవత్సరాలకు పైగా సేవలందించారు.ఆయన పదవీ కాలంలో, ఇంజనీరింగ్ విభాగంలో ఎంతో శ్రద్ధతో మరియు నిబద్ధతతో చేసిన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులు అందుకున్నారు. ఆయన అత్యంత శ్రద్ధతో పనిచేశారు. ఆయన ఆదర్శవంతమైన సేవలకు గాను ప్రతిష్టాత్మకమైన జనరల్ మేనేజర్ అవార్డు కూడా అందుకున్నారు. ఆయన తన వృత్తి పరంగా స్టేషన్ రీమోడలింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు స్టాఫ్ క్వార్టర్స్ రీమోడలింగ్, డిజైన్ వంటి వినూత్న ప్రాజెక్టులతో సహా కీలక విభాగాల్లో పనిచేశారు. రైల్వే కార్యకలాపాల మెరుగుదలకు, భద్రతను దృష్టిలో ఉంచుకుని, ఎల్లవేళల సృజనాత్మకమైన మరియు వినూత్నమైన ఆలోచనలను అందించారు. ఆయన అందించిన సేవలను సహఉద్యోగులు కొనియాడుతూ! వారి తదుపరి విరామ జీవితం సుఖసంతోషాలతో మరియు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకర్షించారు.

# ఇవాళ్టి నుంచి వికసిత్ భారత్ గ్రామీణ్ గ్యారంటీ మిషన్

**న్యూఢిల్లీ(భారత శక్తి)** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూపర్ గుడ్‌న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ గ్రామీణ్ గ్యారంటీ మిషన్కొత్త గ్రామీణ ఉపాధి పథకాన్ని అమలు చేయనుంది. ఇది ప్రస్తుతం అమలులో ఉన్న మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ స్థానంలో వస్తుంది. జులై 2న దీని జాతీయ ప్రారంభోత్సవ కార్యక్రమం తిరుపతిలో జరగనుంది..

ఈ కొత్త పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీని మరింత బలోపేతం చేస్తూ, జీవనోపాధి అవకాశాలను విస్తరించడం, ఆదాయ వనరులను పెంచడం లక్ష్యంగా రూపొందించారు.ఎః–ఉఖీంఓఉ పథకం ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీని పెంచడం.మహిళా స్వయం సహాయక సంఘాల (ాఉఊఉ) ద్వారా లక్ష్మీపతి దీదీల సృష్టించడం..గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వినియోగం. సోషల్ ఆడిట్, పారదర్శకత పెంచడం లక్ష్యంగా ఈ పథకం అమలుకానుంది.. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, స్థిరమైన జీవనోపాధి వంటి లక్ష్యాలను సాధించాలని కేంద్రం భావిస్తోంది.ఇప్పటికే రాష్ట్రాలు తమ అమలు సన్నాహాలను పూర్తి చేసుకోవాలని కేంద్రం సూచించింది.ఈ పథకం అమలుతో దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలపడటం సహా వికసిత భారత్ లో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్రం భావిస్తుంది

## మామిడి దిగుబడి పెరిగినందునే

# కొనుగోళ్లపై ఒత్తిడి

తిరుపతి,**(భారత శక్తి)** చిత్తూరు జిల్లా మామిడి రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, వారు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాంప్రసాద్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈరోజు మీడియాతో మాట్లాడిన ఆయన... గత ఏడాది కూడా కూటమి ప్రభుత్వం రైతులకు కేజీకి రూ.4 చొప్పున అదనంగా చెల్లించి ఆదుకుందని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా అదే రీతిన కేజీకి రూ.4 ముందస్తుగా అందిస్తూ మామిడి కొనుగోళ్లను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.

ఈసారి పంట దిగుబడి ఊహించిన దానికంటే చాలా ఎక్కువగా రావడం వల్లే కొనుగోళ్లపై తాత్కాలికంగా కొంత ఒత్తిడి పెరిగిందని, అంతకుమించి మరేమీ లేదని ఆయన స్పష్టం చేశారు. గత ఏడాది కూడా మామిడి రైతుల కోసం ప్రభుత్వం సుమారు రూ.190 కోట్లు వెచ్చించి అండగా నిలిచిందని ఈ సందర్భంగా ఆయన వివరించారు.రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఒకవేళ కొనుగోళ్ల ప్రక్రియలో ఎక్కడైనా జాప్యం జరిగితే మాత్రం సంబంధిత ఫ్యాక్టరీలపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సంబంధించిన, ఆ పార్టీ సానుభూతి కంపెనీలు కొనుగోళ్ల విషయంలో కావాలని అలసత్వం ప్రదర్శిస్తే మాత్రం ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు. తమ ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలే పరమావధి అని స్పష్టం చేసిన మంత్రి... కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసం రైతుల సమస్యలను వాడుకోవాలని చూడొద్దంటూ వైసీపీ నేతలకు గట్టి కౌంటర్ ఇచ్చారు.

భారత శక్తి
బుధవారం, జూలై 1, 2026

## రాములవారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న తలపా దామోదరం రెడ్డి.



**శ్రీకాళహస్తి(భారత శక్తి)** శ్రీకాళహస్తి మండలం, జగ్గరాజు పల్లి పంచాయతీ, జగ్గరాజుపల్లి గ్రామం నందు నూతనంగా నిర్మింపబడిన రాములు వారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులు యానాది నవీన్ కుమార్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శశి, సురేష్,మహేష్, లక్ష్మయ్య, మాస్,అరుణ్ మరియు గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

# రైల్వే ఉద్యోగి ఆత్మహత్య కేసు

### - నిందితురాలి అరెస్ట్



**రేణిగుంట(భారత శక్తి)** తిరుపతి జిల్లా రేణిగుంట స్థానిక పట్టణంలో సంచలనం సృష్టించిన రైల్వే ఉద్యోగి కిల్లి రవి ఆత్మహత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న ఎస్. ఉషారాణి (35)ను రేణిగుంట పోలీసులు అరెస్ట్ చేశారు.?పోలీసుల కథనం ప్రకారం... కిల్లి రవి ఆత్మహత్య చేసుకున్న తర్వాత రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో లభ్యమైన సూసైడ్ నోట్, పోస్ట్‌మార్టం నివేదిక, సేకరించిన కీలక ఆధారాలు మరియు సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా తిరుపతిలోని మంగళం ప్రాంతానికి చెందిన ఎస్. ఉషారాణిని ఈ కేసులో ముద్దాయిగా నిర్ధారించారు.?కరకంబాడి బస్టాండ్ సమీపంలో అరెస్ట్:?రేణిగుంట మండలం కరకంబాడి బస్టాండ్ సమీపంలో నిందితురాలు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు, రేణిగుంట సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వై . శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు."నిందితురాలిని చట్టప్రకారం అరెస్టు చేసి, విచారణలో భాగంగా ఆమె నుండి కేసునకు సంబంధించిన పలు వివరాలను సేకరించాము. చట్టపరమైన నిబంధనలను పాటిస్తూ ఆమెను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తాము. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉంది."

## ముఖ్యమంత్రి పర్యటనకు
# పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- జూలై 2న ముక్కవారిపల్లికి రానున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు.



**తిరుపతి(భారత శక్తి)** ఓబులవారిపల్లె మండలం ముక్కవారిపల్లి పంచాయతీ వద్ద జూలై 2న నిర్వహించనున్న 'వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్గర్ అండ్ అజీవికా మిషన్ గ్రామీణ్' (వీబీజీ రాంజీ) పథకం ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నారు. ఈ నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి చిన్నపాటి లోపాలకు తావివ్వకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.? ముఖ్యమంత్రి కార్యక్రమాల కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ఎం. రూపానంద రెడ్డిలతో కలిసి కలెక్టర్ బహిరంగ సభ, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు.?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతో పాటు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్ హాజరుకానున్నట్లు తెలిపారు. సుమారు 15 నుంచి 20 వేల మంది ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున సీటింగ్, పార్కింగ్, తాగునీరు, నిరంతర విద్యుత్, వైద్య శిబిరాలు, టాయిలెట్స్ వంటి అన్ని వసతులను రాబోయే రెండు రోజుల్లో పూర్తి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.?ఈ పరిశీలనలో టాస్క్‌ఫోర్స్ ఏఎస్పీ కులశేఖర్, తిరుపతి ఏఎస్పీ శ్రీనివాస్, ఆర్డీవో రామ్మోహన్, వివిధ శాఖల పీడీలు, ఎస్ఈలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీ సినీ వర్కర్స్ హౌసింగ్ సొసైటీకి
# ప్రభుత్వం స్థలాలు కేటాయించలేదు

- వసూళ్లకు, నాకు సంబంధం లేదు
- ఏపీ ఎఫ్.డి.సి డైరెక్టర్, దర్శకుడు సముద్ర




**(భారత శక్తి)**ఆంధ్రప్రదేశ్ సినీ వర్కర్స్ హౌసింగ్ సొసైటీ యూనియన్లు చేసే వసూళ్ళ కార్యకలాపాలతో తనకు ఎటువంటి సంబంధం లేదని దర్శకుడు సముద్ర స్పష్టం చేశారు. ఏపీ ప్రభుత్వం హౌసింగ్ సొసైటీకి ఎలాంటి స్థలాన్ని కేటాయించలేదని ఆయన తెలిపారు.ఏపీ సినీ వర్కర్స్ హౌసింగ్ సొసైటీకి ఏపీ ప్రభుత్వం స్థలాలు ఇచ్చారని, డబ్బులు తీసుకుంటున్నారని కొందరు మిత్రులు తనకు ఫోనులు చేసి ఎంక్వయిరీ చేయడం వల్ల అందరికీ వివరణ ఇవ్వటం కోసం ఈ ప్రకటన ఇస్తున్నానని సముద్ర తెలిపారు. కొత్తగా ఏర్పాటైన ఏపీ ఎఫ్.డి.సి కమిటీ చాలా అద్భుతంగా ఉందని, చిత్రసీమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఏపీ ప్రభుత్వం లేదా ఏపీ సినీ వర్కర్స్ హౌసింగ్ సొసైటీ పేరుతో కొందరు వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తున్నారని వచ్చిన ఆరోపణలను, దుష్ప్రచారాన్ని ఆయన ఖండించారు. అటువంటి కార్యక్రమాలతో తనకు సంబంధం లేదని చెప్పారు. ఏపీ సినీ వర్కర్స్ హౌసింగ్ సొసైటీ పేరుతో డబ్బులు వసూలు చేసినా? తన పేరు చెప్పినా, వాడినా ఊరుకోనని సముద్ర హెచ్చరించారు. ఏపీ ఎఫ్.డి.సి సంస్థకి సంబంధించిన ప్రభుత్వం తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తానని, ఏపీలో చిత్రసీమ అభివృద్ధికి ఏపీ ఎఫ్.డి.సి డైరెక్టర్ గా తన వంతు కృషి చేస్తానని సముద్ర తెలిపారు.

# చెత్తకుప్పలో వెంకన్న చిత్రపటాలు

### - టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన

**తిరుపతి(భారత శక్తి)** స్వామి వారి చిత్రపటాలు మలమూత్రాలు మధ్య, బీరు బాటిల్స్ మధ్య ఉన్నాయి. అలిపిరి –జూపార్క్ రోడ్డులో టీటీడీ నిర్లక్ష్యం ఇదని టీటీడీ మాజీ ఛైర్మన్ పై భూమన కరుణాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసారు. సీఎం చంద్రబాబు పాలనలో టీటీడీ పరిరక్షిస్తున్నామంటూ గొప్పలు చెప్తునే తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని వందలవేల స్వామి వారి ఫొటోలు అన్ని కూడా అత్యంత నిర్లక్ష్యంగా చెత్తకుప్పల్లో పడేశారు. టీటీడీ వాళ్లు పడేసారు అని చెప్పడం లేదు.. విజిలెన్స్ వైఫల్యం చెప్తున్నాం. టీటీడీ ఈవో, ఛైర్మన్ బి.ఆర్ నాయుడు తో సహా చంద్రబాబు ఊడిగం చేసే మీరు సిగ్గుతో తలదించుకోవాలని అన్నారు. వీటిని శుభ్రం చేయాల్సిన బాధ్యత మీకు లేదా.. నిర్లక్ష్యంగా వదిలివేసి చోద్యం చూస్తోం. మీ పాలనలో ఎంత అపచారాలు జరుగుతున్నాయి అనేది కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాం. సనాతన ధర్మం సాంప్రదాయం కాపాడతామన్న పవనానంద స్వామి.. మీ సనాతనం ఎలా ఏడ్చిందో వచ్చి చూడండి. ప్రక్షాళన చేస్తామన్నా పవనానంద స్వామి ఇదేనా ప్రక్షాళన, మీ పాలన అంతా అవినీతి మయమేనని ఆరోపించారు.

## పుష్కరాలకు వచ్చే భక్తులకు
# ఎలాంటి ఇబ్బందులు తలెత్తద్దు


- సౌకర్యాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం
- తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్.



**జగిత్యాల(భారత శక్తి)** 2027 లో జరిగే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కోరకు తీసుకోవాల్సిన చర్యలపై మంగళవారం ప్రైవేట్ కన్సల్టెన్సీ ప్రతినిధులతో కలసి గోదావరి తీరంలో మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ... 2027 లో నిర్వహించే గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని మంత్రి తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఇప్పటికి ప్రభుత్వం రూ. వెయ్యి కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. ధర్మపురి నియోజకవర్గానికి రూ. 117 కోట్లు కేటాయించినట్లు మంత్రి వివరించారు.ధర్మపురి క్షేత్రానికి పుష్కర స్నానాలు ఆచరించే భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తుల కొరకు తాగునీటి సౌకర్యం, డ్రెస్సింగ్ రూమ్స్, మరుగుదొడ్ల సౌకర్యం, పారిశుద్ధ్య పనుల నిర్వహణ కొరకు గత గోదావరి పుష్కరాలకు, కృష్ణ పుష్కరాలకు పనులు చేసిన ప్రతినిధులతో కలిసి మంగళవారం పరిశీలించినట్లు మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చేయాల్సిన ఏర్పాట్లపై కన్సల్టెన్సీ ప్రతినిధులు పూర్తిస్థాయి నివేదిక అందజేస్తారని మంత్రి తెలిపారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం నుండి అదనపు నిధులు తీసుకువచ్చి భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్ తో పాటు వేముల రాజు, ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న , వార్డు కౌన్సిలర్లు చీపిరిశెట్టి రాజేష్, అయ్యోరి గోపాల్, పవన్, ప్రశాంత్, వోజ్జల లక్ష్మణ్ లతో పాటు జక్కు రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డిపై విషప్రచారం మానుకోవాలి

- కాంగ్రెస్ నాయకులు.. రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్



**సూర్యాపేట జిల్లా(భారత శక్తి) :** నల్గొండలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు ప్రజల నుంచి లభించిన విశేష ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై చేసిన వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు.మంగళవారం కోదాడలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నల్గొండ సభ విజయవంతం కావడంతో రాష్ట్ర ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకత్వం భయాందోళనకు గురైందన్నారు. అందుకే ప్రజల దృష్టి మరల్చేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు.మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ముఖ్యమంత్రిని విమర్శించే ముందు తన రాజకీయ చరిత్రను పరిశీలించుకోవాలని సూచించారు. తన హయాంలో మట్టి మాఫియా, ఇసుక మాఫియాలకు అండగా నిలిచి కోట్ల రూపాయల దోపిడీ జరిగిందనే ఆరోపణలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, పోలీసు శాఖ అధికారుల నుంచి డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు.దళిత బంధు పథకం అమలులో లబ్ధిదారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలను ప్రజలు మర్చిపోలేదని పేర్కొంటూ, ఆ ఆరోపణలు అసత్యమైతే బహిరంగంగా సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. వైన్ షాపుల కేటాయింపుల్లో బినామీల ద్వారా సిండికేట్‌లు ఏర్పాటు చేసి భారీగా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా మాజీ ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు.కోదాడ ఖమ్మం క్రాస్‌రోడ్డు వద్ద కోట్ల రూపాయల విలువైన ఆస్తి కబ్జా ఆరోపణలపై కూడా బొల్లం మల్లయ్య యాదవ్ ప్రజలకు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఇతరులపై విమర్శలు చేసే ముందు తనపై వచ్చిన ఆరోపణలకు వివరణ ఇవ్వాలని అన్నారు. తన హయాంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నికలు, ఎంపీపీ, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ అధ్యక్షుల నియామకాల కోసం డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై కూడా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ పార్టీ టికెట్ కోసం కేసీఆర్, కేటీఆర్ వద్ద ఎంత మొత్తం ఖర్చు చేశారో ప్రజలకు వెల్లడించే ధైర్యం మాజీ ఎమ్మెల్యేకు ఉందా అని ప్రశ్నించారు. ఇతరులపై ఆరోపణలు చేసే ముందు తన రాజకీయ ప్రయాణానికి సంబంధించిన వాస్తవాలను ప్రజలకు చెప్పాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకున్నారని చేస్తున్న ఆరోపణలకు ఒక్క ఆధారం కూడా లేదని పేర్కొన్న వారు, నిజంగా ఆధారాలు ఉంటే ప్రజల ముందుకు తీసుకురావాలని, లేకపోతే అబద్ధపు ప్రచారాన్ని వెంటనే నిలిపివేసి రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.అసత్య ప్రచారం, వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలతో రాజకీయాలు చేసే బీఆర్ఎస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రావెళ్ల కృష్ణారావు, మైలారి శెట్టి భాస్కర్ అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిత్వ హననానికి పాల్పడితే కాంగ్రెస్ పార్టీ రాజకీయంగానూ, చట్టపరంగానూ గట్టిగా ఎదుర్కొంటుందని వారు స్పష్టం చేశారు.

## జమ్మికుంట వాసులకు
# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

- అభివృద్ధి సంక్షేమం ప్రజాపాలన లక్ష్యం.. - ప్రణవ్ బాబు..



**జమ్మికుంట(భారత శక్తి)** ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ పాలనలో నిరుపేదలైన లబ్ధిదారులకు సంక్షేమం అభివృద్ధి అందించడమే ప్రభుత్వ లక్ష్యమని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. మంగళవారం నాడు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 82 మంది,30 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు నేరుగా అందజేశారు. నిరుపేదలు పరిస్థితి బాగోలేక ఆసుపత్రులపాలైన వారికి కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ చెక్కుల రూపంలో అండగా ఉంటుందని, ఇప్పటివరకు హుజురాబాద్ లో సుమారు 10కోట్ల రూపాయల చెక్కులు పంపిణీ చేశామని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో పారదర్శకతను పాటిస్తున్నామని త్వరలో రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వబోతున్నామని అన్నారు. సంక్షేమ పథకాల విషయంలో ఏవరైనా డబ్బులు అడిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ప్రజా ప్రజాప్రతినిధులు, మండలాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

# విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి

**ఎల్లారెడ్డిపేట(భారత శక్తి)** మండలం రాచర్ల బొప్పాపూర్ లోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన తరగతి గదులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్కూల్ అభివృద్ధికి రూ. లక్ష విరాళం ప్రకటించిన ఎమ్మెల్యే క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేత, ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ, ఉపాధ్యాయుడికి సన్మానంరాజన్న సిరిసిల్ల జూన్ 30: విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, పాఠశాల పూర్వ విద్యార్థి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్లోని పీ ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నూతన తరగతి గదులను ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై ప్రారంభించారు.

జాతీయ స్థాయి ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే అందించి.. అభినందించారు. అలాగే ఉద్యోగ విరమణ పొందుతున్న డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడిని సన్మానించి.. వారి సేవలను కొనియాడారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఈ విద్యాలయంలో అదనపు తరగతి గదులు పూర్తి చేయించామని తెలిపారు. ఈ విద్యాలయంలో బోధన, వసతులపై నమ్మకంతో తల్లిదండ్రులు పిల్లలను అడ్మిషన్ చేస్తున్నారని వివరించారు. 400 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఇక్కడ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు.పదో తరగతిలో ఈ పాఠశాల నుంచి చాలా మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని వెల్లడించారు. ప్రతి విద్యార్థి తమ నేపథ్యం ఏదైనా తాము ఒక లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే తాము అనుకున్న లక్ష్యం చేరుకుంటారని పేర్కొన్నారు. వివిధ ఉద్యోగాలు, స్వయం ఉపాధి, ఇతర రంగాల్లో స్థిరపడిన తర్వాత విద్యార్థులు సమాజానికి సేవ చేయాలని సూచించారు. విద్యార్థి దశలో మొక్కలు నాటాలని, పరిసరాల పరిశుభ్రత పై వివరించాలని, నీటి వృథాను అరికట్టాలని పేర్కొన్నారు ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.

# ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన

**హుజురాబాద్ టౌన్, (భారత శక్తి)** హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని హుజూరాబాద్ టౌన్ సెక్షన్‌లో మంగళవారం నిర్వహించిన 'ప్రజాబాట' కార్యక్రమంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులు, వ్యవసాయదారులకు విస్తృత అవగాహన కల్పించామని కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) శ్రీ ఉపేందర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందికి విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి 'వన్ మినిట్ సేఫ్టీ' సూత్రాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రతి పని ప్రారంభించే ముందు ప్రమాదాలను అంచనా వేసి, అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని వివరించారు.వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వయంగా ఫ్యూజ్‌లు మార్చేందుకు ప్రయత్నించవద్దని, ఏవైనా లోపాలు తలెత్తినప్పుడు వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు.వ్యవసాయ మోటార్లకు అదనపు లోడ్లు ఉపయోగిస్తున్న రైతులు 5 హెచ్‌పీ నుంచి 7.5 హెచ్‌పీ వరకు అదనపు లోడ్లను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని అవగాహన కల్పించారు.అదేవిధంగా, విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడం, ప్రమాదాల నివారణ లక్ష్యంగా పొడవైన విద్యుత్ లైన్లపై మధ్య స్తంభాల ఏర్పాటు, దెబ్బతిన్న షార్ట్ పోల్స్ మార్పిడి, వదులుగా ఉన్న వైర్ల (లూజ్ స్పాన్లు) సరిదిద్దడం, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ స్తంభాల ప్లింత్‌లను ఎత్తు పెంచడం, వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ భద్రతను మరింత బలోపేతం చేసి, అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎన్‌పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ ఏఈ (ఆపరేషన్), ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది, విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు



# ఆరోగ్య సమస్యలపై ప్రజలు నేరుగా సంప్రదించవచ్చు

**- జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్**



**పెద్దపల్లి (భారత శక్తి)** జిల్లా కేంద్రంలోని ఆసుపత్రిలో రోజుకు సుమారు 1200 మంది వరకు ఓపీ సేవలను వినియోగించుకుంటున్నారని జిల్లా ఆసుపత్రి సూపరింటెం డెంట్ శ్రీధర్ తెలిపారు. వర్షా కాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు తాగునీటిని తప్పనిసరిగా మరిగించి లేదా శుద్ధి చేసి తాగాలని, బయట ఆహారం, కలుషితమైన ఆహార పదార్థాలను తీసుకోరాదని సూచించారు. భోజనం ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆసుపత్రికి అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్య పరికరాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామ ని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ప్రజలందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ప్రతిరోజూ ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సూపరింటెం డెంట్ జిల్లా ఆసుపత్రి రూమ్ నెం.16లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆసు పత్రి సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, సూచనలు, ఆరోగ్య సమస్యలపై కూడా ప్రజలు నేరుగా సంప్రదించ వచ్చని, ఫోన్ ద్వారా ఎప్పుడై నా స్పందించేందుకు సిద్ధంగా ఉంటారని జిల్లా ఆసుపత్రి పెద్దపల్లి సూపరిండెంట్ డాక్టర్ శ్రీధర్ ఈ సందర్భంగా పేర్కొ న్నారు.

# అమరావతిలో రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు

**విజయవాడ,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగానికి మళ్లీ అద్భుతమైన పూర్వవైభవం వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి నిర్మాణ పనులను దాదాపు రూ. 48 వేల కోట్లతో వేగవంతం చేయడం, ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధుల విడుదల వంటి సానుకూల పరిణామాలు మార్కెట్‌కు కొత్త బూస్ట్ ఇచ్చాయి. రిటర్నబుల్ రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్ల 'రీ-సేల్' లావాదేవీలు ప్రస్తుతం రికార్డు స్థాయిలో ఊపందుకున్నాయి.రాజధాని కోర్ ఏరియా పరిధిలోకి వచ్చే తుళ్లూరు, మంగళగిరి, మందడం, వెలగపూడి పరిసర ప్రాంతాల్లోని భూములకు ఇప్పుడు ఇన్వెస్టర్ల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. ఒకప్పుడు వెలవెలబోయిన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పుడు కొనుగోలుదారులు, రియల్టర్ల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లతో నిత్యం హడావుడిగా మారుతున్నాయి. ముఖ్యంగా తుళ్లూరు పరిసరాల్లో ఐదేళ్ల క్రితం చదరపు గజం రూ. 12,000 నుంచి రూ. 15,000 పలికిన సీఆర్డీయే ప్లాట్ల ధరలు, ఇప్పుడు డిమాండ్‌ను బట్టి గజం రూ. 35,000 నుండి ఏకంగా రూ. 55,000 మార్కును తాకాయి. పక్కా లీగల్ క్లియరెన్స్, ప్రభుత్వ గుర్తింపు ఉండటంతో హైదరాబాద్, బెంగళూరు సహా ఎన్‌ఆర్‌ఐ ఇన్వెస్టర్లు ఇక్కడి ప్లాట్లను కొనుగోలు చేయడానికి పోటీ పడుతున్నారు.రాజధాని కోసం నాడు భూములిచ్చిన రైతులకు సీఆర్డీయే ఇటీవలే వీధిపోట్లు, వాస్తు లోపాలు లేని ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయించి ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందజేసింది. ల్యాండ్ పూలింగ్ ప్లాట్ల తొలి విడత రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం ఎటువంటి ఫీజు వసూలు చేయకపోవడంతో రైతులు వేగంగా ప్రక్రియ ముగిస్తున్నారు. అలా రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్లను సొంత అవసరాల కోసం, ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా రైతులు ఓపెన్ మార్కెట్‌లో విక్రయిస్తుండటంతో క్రయవిక్రయాల సర్కిల్ వేగంగా తిరుగుతోంది. టైటిల్ పక్కాగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుండటంతో ఎలాంటి లీగల్ రిస్క్ లేని ఈ ప్లాట్లను కొనేందుకు బయ్యర్లు ఎగబడుతున్నారు. మరో వైపు ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన, విచిత్రమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సొంత యువత భవిష్యత్తు కోసం, పక్క రాష్ట్రాల రాజధానులపై ఆధారపడే అవసరం లేకుండా ప్రభుత్వం ఎంతో ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తున్న సొంత రాజధాని అమరావతిపై.. సొంత రాష్ట్రానికి చెందిన వారే కుట్రలు చేయడం, దాన్ని కొంతమంది సమర్థించడం నవ్యాంధ్రకు పట్టిన పెద్ద దౌర్భాగ్యం. ఈ వైఖరి ఎలా ఉందంటే.. "నా కన్ను పోయినా పర్వాలేదు.. ఎదుటివారికి శకునం కాకూడదు" అన్న చందంగా, మన కొంపను మనమే తగులబెట్టుకున్నట్లు ఉంది. "వ్యక్తిగతంగా మాకు ఎలాంటి లాభం లేదు కాబట్టి, అమరావతితో మాకేం పని?" అని భావించే కొంతమంది అమాయకులను, స్వార్థపరులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, దాని అనుకూల శక్తులు కుట్రలకు తెరలేపుతున్నాయిఐదేళ్ల కాలంలో జగన్ మోహన్ రెడ్డి అమరావతిని పూర్తిగా పాడుబెట్టి, ఒక అడవిలా మార్చేసిన వైనాన్ని రాష్ట్రం చూసింది. ఆ 'జంగిల్' క్లియర్ చేయడానికే కొత్త ప్రభుత్వానికి దాదాపు ఆరు నెలల కాలం పట్టిందంటే విధ్వంసం ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఆ అవరోధాలన్నింటినీ దాటుకుని, గత ఏడాదిన్నర కాలంగా శ్రమించి రాజధాని పనులను మళ్లీ పట్టాలెక్కించిన తరుణంలో.. ఇప్పుడు మళ్లీ బెంగళూరు వేదికగా కుట్రల పర్వం ప్రారంభం కావడం ఘోరం. రాజధాని అనేది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన భూముల వ్యవహారం కాదు. అది కోట్లాది మంది ఆంధ్రుల ఆత్మగౌరవం, రాబోయే తరాల ఉపాధి కేంద్రం. ఇటువంటి మహోన్నత ప్రాజెక్టును రాజకీయ కక్ష సాధింపుల కోసం దెబ్బతీయాలని చూడటం రాష్ట్ర ద్రోహమే అవుతుంది.

# రెండు ఎమ్మెల్సీ సీట్లకు 10 మంది పోటీ

**విజయవాడ,(భారత శక్తి)** కూటమి నేతలకు నామినేటెడ్ పదవులు ఊరిస్తున్నాయి. రాజ్యసభ ఎన్నికల సందడి ముగిసిన వెంటనే, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ రేసు మొదలైంది. వచ్చేనెలలో ఇద్దరు ఎమ్మెల్సీల పదవీకాలం ముగియనుంది. ఈ ఇద్దరూ గవర్నర్ కోటాలో ఎంపికైన వారే కావడంతో ఆ రెండు స్థానాలను అధికార కూటమి దక్కించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత రెండు ఎమ్మెల్సీ స్థానాలను భర్తీ చేసే చాన్స్ రావడంతో కూటమి నేతలు ఎవరికి చాన్స్ ఇస్తారనేది ఆసక్తికరంగా మారింది. రెండేళ్లుగా పదవుల కోసం ఎదురుచూస్తున్న పలువురు నేతలు ఈ సారైనా అధిష్టానం తమకు అవకాశం ఇస్తుందా? లేక ఈ సారి కూడా 'సారీ' అంటూ చేతులు దులుపుకుంటుందా? అని టెన్షన్ పడుతున్నారు.వచ్చేనెల 27తో శాసనమండలిలో గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా ఎంపికైన జకియా ఖానం, పండుల రవీంద్రబాబు పదవీకాలం ముగియనుందని శాసన మండలి రికార్డులు ద్వారా తెలుస్తోంది. దీంతో ఆ రెండుస్థానాల భర్తీకి జులైలో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని అంటున్నారు. జూన్ లో 4 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరిగితే, పలువురు ఆశావహులు పోటీ పడ్డారు. కానీ, రకరకాల సమీకరణాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ నలుగురు అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ సమయంలో పలువురు ఆశావహులకు ఎమ్మెల్సీ అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులపై వారు ఆశ పెట్టుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా మంది ఎమ్మెల్సీ పదవుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరిలో గత ఎన్నికల సమయంలో సీట్లు కోల్పోయిన త్యాగరాజులే ఎక్కువగా ఉన్నారు. ఇలా ఎమ్మెల్సీ పదవులు కోరుకుంటున్న వారిలో టీడీపీ నేతలే ఎక్కువగా ఉన్నారు. వీరిలో ప్రధానంగా మాజీ మంత్రి, సీనియర్ నేత దేవినేని ఉమాతోపాటు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, బుద్ధా వెంకన్న, వంగవీటి రాధాకృష్ణ, మహాసేన రాజేశ్ వంటి వారి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఈ ఐదుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ హామీ ఇచ్చినట్లు గుర్తు చేస్తున్నారు.సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి ఉప ముఖ్యమంత్రి పవన్ కోసం టికెట్ వదులుకున్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ విషయంలో పార్టీ కేడర్ కూడా ఉత్కంఠగా ఎదురుచూస్తోందని అంటున్నారు. తాజాగా ఆయనను నియోజకవర్గ ఇంచార్జి బాధ్యతల నుంచి కూడా తప్పించారు. దీంతో వర్మ త్యాగం నిష్ఫలం అయిందని అసంతృప్తి కేడర్ లో వ్యక్తమవుతోందని అంటున్నారు.

అయితే వర్మకు తగిన న్యాయం చేయాలని ముఖ్య నేతలు ఇద్దరూ భావిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఈ సారి ఎమ్మెల్సీ చాన్స్ ఇస్తారా? లేదా? అన్నది ఆసక్తి రేపుతోంది.నిందితుడికి మరణ దండన ఖాయం చేసిన కోర్టు మరోవైపు మైలవరం సీటు వదులుకున్న దేవినేని ఉమా, విజయవాడ పశ్చిమ సీటును త్యాగం చేసిన బుద్ధా వెంకన్న, పి.గన్నవరం నుంచి పోటీకి అవకాశం దక్కినా, చివరి నిమిషంలో అధిష్టానం సూచనతో వెనక్కి తగ్గిన మహాసేన రాజేశ్ కూడా ఎమ్మెల్సీ ఆశావహులుగా గట్టి పోటీ ఇస్తున్నారని చెబుతున్నారు. ఇక పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా పేరు కూడా చాలాసార్లు తెరపైకి రావడం, ఆ తర్వాత మరుగున పడిపోవడం జరుగుతోందని చెబుతున్నారు. దీంతో ఆయన పేరు ఈ సారి అయినా పరిశీలిస్తారా? లేదా? అన్నది చూడాల్సివుందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం కాపు సామాజిక వర్గం కేంద్రంగా రాజకీయం నడుస్తున్ననేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రాధా పేరు పరిశీలించే అవకాశం ఉందని అంటున్నారు. మొత్తానికి మరో నెల రోజుల్లో భర్తీ అయ్యే గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవులు కూటమిలో ఆసక్తికర రాజకీయానికి తెరతీశాయని అంటున్నారు. ఈ విషయంలో ప్రధాన నేతలు ఇద్దరు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేదే ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు

# బెజవాడలోఅన్నదమ్ముల మధ్య సవాల్

**విజయవాడ,(భారత శక్తి)** విజయవాడలో అన్నా దమ్ముల రాజకీయ సమరం జోరుగా సాగుతోంది. ఒకరు ఎంపీగా ఉన్నారు. మరొకరు మాజీ ఎంపీ. ఈ ఇద్దరి మధ్యన చిచ్చు రాజుకుంది. ఎత్తులు పై ఎత్తులతో అన్నదమ్ముల పాలిటిక్స్ సాగుతోంది. తాజాగా చూస్తే కేశినేని నాని ఎంపీ చిన్ని మీద ఏకంగా భూకబ్జా ఆరోపణలతో అతి పెద్ద బాంబునే వేశారు. కేశినేని చిన్ని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నం చేశారంటూ కేశినేని నాని గట్టిగానే టార్గెట్ చేశారు. దీంతో విజయవాడ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కిందివిజయవాడ ఎంపీ కేశినేని చిన్ని హైదరాబాద్ దగ్గరలోని షంషిగూడలో 112.72 ఎకరాల ప్రభుత్వ భూమిని భారీగా కబ్జా చేసేందుకు ప్రయత్నించారని కేశినేని నాని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈసారి ఆయన నేరుగా తెలంగాణా ముఖ్యమంత్రినే మధ్యలోకి తీసుకుని వచ్చారు. తాను ఈ భూకబ్జా యత్నం విషయంలో రేవంత్ రెడ్డికే బహిరంగంగా విజ్ఞప్తి చేస్తున్నాను అని అన్నారు. ఈ భూమిని నిజానికి టీజీ ఐఐసీ ఐటీ పార్క్ కోసం కేటాయించింది అని నాని పేర్కొన్నారు. అయితే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని ఆయనకు సంబంధించిన సంస్థలు అయితే ఒక మోసపూరితమైన న్యాయపరమైన ఒప్పందం ద్వారా ఆ భూమిని అక్రమంగా తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని నాని విమర్శించారు.ఇక ఇది పక్కాగా ప్రభుత్వం భూమి అని ప్రైవేట్ వ్యక్తులకు సంస్థలకు ఎలాంటి యాజమాన్యం హక్కులు లేనే లేవని ఆ జిల్లా కలెక్టర్ కూడా సమర్పించిన అఫిడవిట్ లో స్పష్టం చేసారు అని నాని తెలిపారు. అందువల్ల ఈ ఆరోపితమైన ఆక్రమణను అడ్డుకోవాలని ఆయన కోరారు. అంతే కాదు ఇందులో ఎవరి ప్రమేయం ఉందో వారి మీద క్రిమినల్ చర్యలు కూడా తీసుకోవాలని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డికి డైరెక్ట్ గానే వినతి చేసారు. అంతే కాదు ఒక ప్రభుత్వ భూమిని రక్షించే విషయంలో హైడ్రా అలాగే ప్రభుత్వ అడ్వకేట్ జనరల్ కూడా జోక్యం చేసుకోవాలని కూడా కేశినేని నాని కోరడం విశేషం.కేశినేని నాని ఈ ఆరోపణలు చేస్తూ ఊరుకోలేదు. తన సోషల్ మీడియా ద్వారా చేసిన ఆ ఆరోపణలతో కూడిన ట్వీట్ ని ఆయన తెలంగాణా సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు, అలాగే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా అగ్ర నేతలు అందరికీ ట్యాగ్ చేయడం విశేషం. చిన్ని రియాక్షన్ : ఇదిల ఉంటే తన మీద సోదరుడు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు అని ఇప్పటికే కేశినేని చిన్ని లీగల్ నోటీసులు జారీ చేశారు. అంతే కాదు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఇపుడు ఏకంగా వేల కోట్ల రూపాయల విలువలైన ప్రభుత్వ భూమిని చిన్ని ఆక్రమించడానికి ప్రయత్నం చేస్తున్నారు అని నాని ఆరోపణలు చేయడంతో చిన్ని ఏమి చేస్తారు అన్న చర్చ సాగుతోంది. మొత్తం మీద చూస్తే కేశినేని బ్రదర్స్ ల మధ్య రచ్చ ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు అని అంటున్నారు.

# అలా ముగిసిన శ్రీ లక్ష్మి ముగింపు

**విజయవాడ,(భారత శక్తి)** సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి మంగళవారం రిటైర్ అయ్యారు. ఈ నెల 25న ఆమెకు పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత రిటైర్మెంటుకు ఐదు రోజుల ముందు పోస్టింగ్ ఇచ్చినా, వరుసగా మూడు రోజులు సెలవు కావడంతో శ్రీలక్ష్మి కేవలం రెండు రోజులు మాత్రమే విధులకు హాజరయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందులో ఒక రోజు బాధ్యతలు తీసుకోవడానికి సరిపోగా, రెండో రోజు రిటైర్మెంటు ఉత్తర్వులు తీసుకున్నారు. ఈ విధంగా ఒక సీనియర్ ఐఏఎస్ అధికారి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టులో రిటైర్ అవ్వడం హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డితో ఉన్న సంబంధాలు కారణంగా ప్రభుత్వం శ్రీలక్ష్మిని రెండేళ్లుగా వెయిటింగులో పెట్టిందని అంటున్నారు. ఇక రిటైర్మెంటును దృష్టిలో పెట్టుకుని న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా శ్రీలక్ష్మికి పోస్టింగు ఇచ్చిందని అంటున్నారు. సీనియర్ ఐఏఎస్ అధికారిణి వై.శ్రీలక్ష్మి ఉద్యోగ జీవితానికి కూటమి ప్రభుత్వం విలక్షణమైన ముగింపు చెప్పిందని అంటున్నారు. కేంద్ర కేబినెట్ కార్యదర్శి హోదాలో రిటైర్ కావాల్సిన శ్రీలక్ష్మి ఎటువంటి గుర్తింపు లేని పోస్టులో రిటైర్ కానుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 22 ఏళ్లకే సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కు వెళ్లిపోయారు. అయితే గత ప్రభుత్వంలో తెలంగాణ కేడర్ నుంచి ఏపీకి మారిన శ్రీలక్ష్మి మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టింగుకు నోచుకోక రెండేళ్లుగా వెయిటింగులో ఉన్నారు. అంతా సక్రమంగా ఉంటే ఆమె ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేదా కేంద్ర కేబినెట్ కార్యదర్శి ర్యాంకులో రిటైర్ కావాల్సివుందని అంటున్నారు. కానీ, ఆమెపై ఉన్న కేసుల కారణంగా ఆలిండియా సర్వీసుల్లోని అత్యున్నత పోస్టులకు అర్హత కోల్పోయారని వ్యాఖ్యానిస్తున్నారు.ఇక 1988లో సర్వీసులోకి వచ్చిన శ్రీలక్ష్మి దాదాపు 38 ఏళ్లపాటు ఐఏఎస్ అధికారిణిగా వివిధ హోదాల్లో పనిచేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో గనుల శాఖ కార్యదర్శిగా పనిచేసిన సమయంలో ఓబుళాపురం మైనింగ్ స్కాంలో ఇరుక్కుని కెరీర్ లో ఒడిదుడుకులు ఎదుర్కొన్నారని చెబుతున్నారు. ఓబుళాపురం మైనింగ్ స్కాం నిందితుల జాబితాలో శ్రీలక్ష్మిని సీబీఐ చేర్చడంతో 2011లో అరెస్టు అయ్యారు. ఆ తర్వాత ఈ కేసు విషయమై న్యాయపోరాటం చేస్తూ పలుమార్పు జైలుకు వెళ్లడం, బెయిలుపై రావడం ద్వారా ఆమె కెరీర్ తీవ్ర ఇబ్బందుల్లో పడిపోయిందని అంటున్నారు. ఈ వ్యవహారం వల్లే పెద్ద పోస్టింగులకు నోచుకోలేకపోయారని అంటున్నారు. చివరికి రిటైర్మెంట్ సమయంలోనూ ఓబుళాపురం మైనింగ్ స్కాం భూతంలా వెంటాడటంతో సాధారణ పరిపాలన శాఖలో జీపీఎం అండ్ ఏఆర్ విభాగంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సరిపెట్టుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. సాక్ష్యంగా నిలిచిన మరో వ్యక్తి యంగ్ అండ్ డైనమిక్ ఆఫీసర్ గా కెరీర్ ప్రారంభించిన శ్రీలక్ష్మి.. ఉమ్మడి రాష్ట్రంలో ఓబుళాపురం మైనింగ్ ద్వారా అత్యంత వివాదాస్పద అధికారిణిగా ముద్రపడ్డారని అంటున్నారు. అంతేకాకుండా ఆ కేసు ద్వారా ప్రస్తుత విపక్ష నేతలతో ఆమెకు బలమైన సంబంధాలు ఉన్నాయని ప్రభుత్వానికి టార్గెట్ గా మారారని చెబుతున్నారు. ఈ కారణంగానే కూటమి ప్రభుత్వం వచ్చిన నుంచి ఆమెను పక్కన పెట్టారని, చివరికి ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టుతో పదవీ విరమణకు అవకాశం కల్పించారని చెబుతున్నారు. దీంతో అఖిల భారత సర్వీసు అధికారుల్లో శ్రీలక్ష్మి ఎపిసోడ్ హాట్ టాపిక్ గా మారింది. ఎన్నో వివాదాలు, మరెన్నో రాజకీయాల మధ్య సాగిన శ్రీలక్ష్మి ఉద్యోగ ప్రస్థానం ప్రస్తుతం సర్వీసులో ఉన్న అధికారులు ఒక పాఠంగా నేర్చుకోవాలని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# పెన్షన్‌ల నుంచి ప్రాజెక్ట్‌ల వరకు..

**తిరుపతి,(భారత శక్తి)** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పరుగులు పెట్టించేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా జూలై 1 నుంచి జూలై 5 వరకు పలు జిల్లాల్లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. ఐదు రోజుల పాటు సాగనున్న ఈ పర్యటనలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో పాటు నేరుగా ప్రజల్లోకి సీఎం చంద్రబాబు వెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా జూలై 1వ తేదీన సీఎం చంద్రబాబు నెల్లూరు జిల్లా చిలకపూరు మండలంలో పర్యటించనున్నారు.అక్కడ స్వయంగా లబ్ధిదారులకు 'ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు.

అదే రోజు తిరుపతి జిల్లా శ్రీసిటీలో ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం 'హీరో మోటో కార్ప్' సంస్థ రూ. 750 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించిన 'గ్లోబల్ పార్ట్స్ సెంటర్'కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. జూలై 2న తిరుపతి జిల్లా రైల్వే కోడూరులో జరిగే వీబీజీ రాంజీ కార్యక్రమానికి సీఎం హాజరవుతారు. అనంతరం తిరుపతిలోనే నిర్వహించనున్న ప్రతిష్టాత్మక 'ఊఆఖ కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాప్'లో పాల్గొని అధికారులకు దిశా నిర్దేశం చేయనున్నారు.ఇక జూలై 3వ తేదీన రాయలసీమ ముఖచిత్రాన్ని మార్చేలా ప్రతిష్టాత్మక 'రాయలసీమ స్టీల్ ప్లాంట్' పనులను కడప జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించనున్నారు. కడప పర్యటన ముగించుకుని జూలై 3వ తేదీనే సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పం చేరుకుంటారు. జూలై 3 నుంచి జూలై 5వ తేదీ వరకు వరుసగా మూడు రోజుల పాటు కుప్పంలోనే ఆయన బస చేయనున్నారు. ఈ మూడు రోజుల్లో నియోజకవర్గానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు కీలక అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు స్థానిక నేతలు, ప్రజలతో నేరుగా ముఖాముఖి కానున్నారు.

# వారణాసి..ఇక ఓన్లీ వెజ్

**లక్నో,(భారత శక్తి)** ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసి నగరం త్వరలో శాకాహార నగరంగా మారనుంది. వారణాసి నగర మున్సిపల్ కార్పొరేషన్(వీఎంసీ) తన పరిధిలోని మాంసం, చేపలు, కోళ్ల దుకాణాలను నగర శివార్లకు తరలించాలని నిర్ణయించింది.

ఈ మేరకు మేయర్ అశోక్ తివారీ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. దీంతో నగర పరిధిలో ఉన్న 350 నుంచి 400 మాంసం దుకాణాలను రాబోయే ఆరు నెలల్లో దీపావళిలోపు విడతల వారీగా నగర శివార్లకు తరలించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.ఈ దుకాణాలను రామ్నగర్, సుజాబాద్, గణేశ్‌పూర్, అవలేష్ నగర్, శివపూర్ ప్రాంతాలకు తరలించనున్నారు. దీంతో కాశీనగరం దేశంలోని రెండవ శాకాహార నగరంగా మారనుంది. ప్రస్తుతం ప్రపంచంలోని ఏకైక పూర్తి శాకాహార పట్టణంగా గుజరాత్ రాష్ట్రంలోని 'పాలితానా' గుర్తింపు పొందింది.

ఇక్కడ 2014 నుంచి మాసం, చేపలు, గుడ్లు విక్రయాలపై నిషేధం అమల్లోఉంది. వారణాసిలో హిందువులు 72శాతం, ముస్లింలు 27శాతం ఉన్నారనేఅంచనాలున్నాయి.తాజా నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నగర పరిశుభ్రత, పుణ్యక్షేత్రం ప్రత్యేకత దృష్ట్యా స్వాగతిస్తుండగా.. మరికొందరు దుకాణాలు దూర ప్రాంతాలకు మారితే వినియోగదారులకు, వ్యాపారులకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం మాంసాహారాన్ని నిషేధించడం కాదని.. కేవలం దుకాణాలను వేరే ప్రాంతానికి తరలించి.. అక్కడ వ్యాపారాలు చేసుకునేలా అవకాశాలు కల్పిస్తున్నామని చెబుతున్నారు.

# పీవీ సునీల్ రిటైర్మెంట్ అనుహ్యాం..

**విజయవాడ,(భారత శక్తి)** సుదీర్ఘకాలం పాటు వివాదాలకు కేంద్రీకృతంగా మారిన సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏపీ సీఐడీ మాజీ అడిషనల్ డీజీ పీవీ సునీల్‌కుమార్‌కు కూటమి ప్రభుత్వం ఊహించని గట్టి షాక్ ఇచ్చింది. ఈ నెలాఖరున ఆయన పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే ఆయనను జూన్ 30న "సేవల నుంచి కేవలం రిలీవ్" చేస్తూ అత్యంత సంచలన ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వం. ఆల్ ఇండియా సర్వీస్ నిబంధనలను పక్కాగా అమలు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు ఐపీఎస్ వర్గాలతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.సాధారణంగా ఏ ప్రభుత్వ ఉద్యోగి అయినా ఎలాంటి మచ్చ లేకుండా తన సుదీర్ఘ సర్వీసును ముగిస్తే, ప్రభుత్వం పూర్తి రిటైర్మెంట్ ప్రయోజనాలతో గౌరవంగా పంపిస్తుంది. కానీ, సునీల్‌కుమార్ వ్యవహారంలో సర్కార్ చట్టబద్ధమైన వీడ్కోలుకు బదులు పోలీస్ ఎస్కేప్ రూట్ ను క్లోజ్ చేసే వ్యూహాన్ని ఎంచుకుంది. ఆయనపై ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం, ల్యాండ్ గ్రాబింగ్, ఫోర్జరీ మరియు క్రిమినల్ కేసులపై సాగుతున్న విచారణలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా ఉండేందుకే ఈ రిలీవింగ్ అస్త్రాన్ని ప్రయోగించింది. ఆయన విధుల్లోంచి తప్పుకున్నప్పటికీ, నిందితుడిగా ఆయనపై ఉన్న దర్యాప్తు సంస్థల విచారణలు సివిల్ వ్యక్తిగా యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ తాజా ఉత్తర్వుల వల్ల పీవీ సునీల్‌కుమార్‌కు తక్షణమే భారీ ఆర్థిక, సాంకేతిక షాక్‌లు తగలనున్నాయి. ఆల్ ఇండియా సర్వీసెస్ రూల్స్ ప్రకారం.. ఇలా విచారణలు పెండింగ్‌లో ఉంచి రిలీవ్ చేసినప్పుడు, సదరు అధికారికి అందాల్సిన పూర్తి స్థాయి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పూర్తిగా నిలిచిపోతాయి. ఆయనకు కేవలం బతుకుదెరువుకు అవసరమైన తాత్కాలిక ప్రొవిజనల్ పెన్షన్ మాత్రమే అందుతుంది. రేపు విచారణ ముగిసి కోర్టులో కానీ, శాఖాపరంగా కానీ ఆయన దోషిగా తేలితే.. ఈ పెన్షన్‌ను కూడా శాశ్వతంగా రద్దు చేసే లేదా భారీగా కోత విధించే సర్వాధికారాలు ప్రభుత్వానికి లీగల్‌గా సంక్రమిస్తాయి.ఏపీ ప్రభుత్వం తదుపరి కఠిన చర్యల కోసం రాష్ట్ర డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జూన్ 30న సాయంత్రం ఆయన ఆఫీస్ నుంచి రిలీవ్ అయిన వెంటనే, ఆయనపై ఉన్న క్రిమినల్ కేసుల దర్యాప్తును మరింత వేగవంతం చేయాలని, చట్టపరమైన చర్యల కోసం అవసరమైన చార్జ్‌షీట్లను కోర్టుల్లో దాఖలు చేయాలని సూచించింది. గత వైసీపీ హయాంలో రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న సునీల్‌కుమార్.. పదవీ విరమణతోనైనా కేసుల నుంచి విముక్తి లభిస్తుందని ఆశించినా, కూటమి ప్రభుత్వం నిబంధనల ఉచ్చుతో వేసిన పక్కా స్కెచ్‌తో ఆయన భవిష్యత్తు ఇప్పుడు పూర్తిగా అంధకారంలో పడిపోయింది.

# వైసీపీ టార్గెట్ పోలీస్

**గుంటూరు,(భారత శక్తి)** ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న తాజా రాజకీయ వ్యూహాలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో తమ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన ప్రధాన ప్రతిపక్షం, శాంతిభద్రతలను కాపాడే పోలీసు వ్యవస్థనే తమ ప్రధాన ప్రత్యర్థిగా మార్చుకున్నట్లు కనిపిస్తోంది.

ఇటీవల ఆ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని ఒక పోలీసు అధికారిని ఉద్దేశించి "మూడేళ్ల తర్వాత నీ సంగతి చూస్తానురా " అంటూ బహిరంగంగానే హెచ్చరించడం, మరోవైపు సాయికృష్ణ ఇష్యూను సాకుగా చూపిస్తూ మొత్తం పోలీసు శాఖనే నిందితులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ఇందులో భాగమే.రాజకీయ ప్రయోజనాల కోసం పదే పదే పోలీసులపై ఇలాంటి ఒత్తిళ్లు తీసుకురావడం పక్కా ప్రణాళిక ప్రకారమే జరుగుతోందనే అనుమానాలు బలపడుతున్నాయి.వైసీపీ ఇలా పద్ధతి ప్రకారం పోలీసుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయాలని చూడటం వెనుక ఒక లోతైన వ్యూహం దాగి ఉంది. శాంతిభద్రతలను పర్యవేక్షించే వ్యవస్థను మానసికంగా భయపెట్టడం ద్వారా, క్షేత్రస్థాయిలో తమ అరాచక రాజకీయాలను ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగించవచ్చనేది ఆ పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా కనిపిస్తోంది. తాము అధికారంలో లేనప్పటికీ.. రేపు రాబోయే రోజుల్లో తామే వస్తామంటూ హెచ్చరికలు జారీ చేయడం ద్వారా, విధుల్లో ఉన్న అధికారులు చట్టప్రకారం కఠిన నిర్ణయాలు తీసుకోకుండా వెనకడుగు వేసేలా 'ఫియర్ సైకాలజీ'ని ప్రయోగిస్తున్నారు.

ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థల మనుగడకే ప్రమాదకరంగా మారుతోంది. చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులపైనే భౌతిక దాడులకు దిగడం, లేదా వారిని వ్యక్తిగతంగా, సామాజికంగా బద్నాం చేయడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న కానిస్టేబుల్స్ నుంచి ఉన్నతాధికారుల వరకు తీవ్ర అసంతృప్తి నెలకొనే అవకాశం ఉంది. పోలీసుల రక్షణకే ముప్పు వాటిల్లితే, రేపు సామాన్య ప్రజల భద్రతకు ఎవరు గ్యారెంటీ ఇస్తారనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రతిపక్షం చేస్తున్న ఈ వ్యూహాత్మక దాడులను కేవలం ఒక రాజకీయ ప్రక్రియగా వదిలేస్తే, అది భవిష్యత్తులో మరింత శాంతిభద్రతల క్షీణతకు కారణమవుతుందిఈ అరాచక, బెదిరింపు రాజకీయాలను నిర్వీర్యం చేయాల్సిన బాధ్యత ఇప్పుడు పోలీసు యంత్రాంగంపైనే ఉంది. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, విధులకు ఆటంకం కలిగిస్తూ పోలీసుల స్థైర్యంపై దాడి చేస్తున్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. పార్టీలతో సంబంధం లేకుండా, చట్టాన్ని ఉల్లంఘించే నాయకులకు చట్టపరంగానే సరైన 'షాక్ ట్రీట్‌మెంట్' ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్పుడే వ్యవస్థల పట్ల ప్రజలకు నమ్మకం పెరుగుతుందని, పోలీసుల ఆత్మస్థైర్యం చెక్కుచెదరకుండా నిలబడుతుందని పౌర సమాజం గట్టిగా ఆకాంక్షిస్తోంది.

## మైండ్ గేమ్

ఆంధ్రప్రదేశ్ లో వైసీపీ అన్ని ప్రధాన విషయాల్లోనూ అధికార పార్టీని ట్రాప్ లోకి లాగే ప్రయత్నం చేస్తుంది. ప్రజలకు అవసరమైన అంశాలతో పాటు సామాజికపరమైన అంశాలను కూడా తమకు అనుకూలంగా మలచుకుంటూ, అధికార పార్టీని ఇబ్బందులపాలు చేయడానికి ప్రయత్నిస్తుంది. వైసీపీ ట్రాప్ లో కొంత వరకూ టీడీపీ పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆ ఒక్కటి చాలదూ.. అన్నట్లు ఇక వైసీపీ నాయకత్వం వేగం పెంచింది. పాలిటిక్స్ లో హీట్ తగ్గకుండా ప్రతి రోజూ వార్తల్లో నిలిచి ఉండేలా చూసుకుంటూ అధికార పార్టీని ఇబ్బందుల పాలు చేయడానికి వేస్తున్న ప్లాన్ ఎంత వరకూ ఫలిస్తుందో తెలియదు కానీ, కొంత వరకూ సక్సెస్ అయినట్లే కనిపిస్తుంది... విజయవాడలో సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ వైసీపీ వెంటనే రియాక్ట్ అయి బాధిత కుటుంబాన్ని జగన్ పరామర్శించిన తర్వాతనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, తొలుత విచారణకు ఆదేశించి, ఆ తర్వాత సిట్ ను నియమించిందని వైసీపీ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటుంది. నిజానికి అప్పటి వరకూ విజయవాడలోని టీడీపీ నేతలు కూడా దీనిని పట్టించుకోలేదు.

కానీ ప్రధాన సామాజికవర్గాన్ని లక్ష్యంగా చేసుకుని వైసీపీ ప్రయత్నించడంతో తాము వెనకబడి పోతామన్న భయంతో టీడీపీ పరుగులు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందన్న కామెంట్స్ సొంత పార్టీ సోషల్ మీడియాలోనే వినిపిస్తున్నాయి. దీనిని పూర్తిగా కొట్టిపారేయలేని పరిస్థితి. మరొకవైపు నిన్న వైసీపీ నేతలు రాజధాని అమరావతి పర్యటన పెట్టుకోవడం కూడా అందులో భాగమే. అమరావతికి వెళ్లేందుకు వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలను టీడీపీ నేతలు అడ్డుకుంటారని తెలుసు. కానీ కావాలనే వైసీపీ నేతలు అమరావతి పర్యటనకు బయలుదేరారు. వారు ఊహించినట్లుగానే టీడీపీ నేతలు దాడికి దిగారు. దీంతో కానిస్టేబుల్ కు గాయాలయ్యాయి. అంతే కాదు.. తమ పార్టీకి కావాల్సిన మైలేజీ లభించిందని వైసీపీ తన రాజధాని ప్రయాణాన్ని మానుకుంది. ఇలా అనేక విషయాల్లో వైసీపీ అధికార పార్టీని ట్రాప్ లో లాగడం, తమ వల్లనే ఇదంతా జరిగిందని ప్రచారం చేసుకుంటుండటంతో కూటమి ప్రభుత్వానికి మింగుడుపడటం లేదు. మరి వైసీపీ ఈ నయా పాలిటిక్స్ నుంచి అధికార పార్టీ ఎలా బయటపడుతుందన్నది చూడాలి. ఇప్పటికైతే వైసీపీ కొంత మేర ఎఫెన్స్ లో ఉందనే చెప్పాలి.

# బుల్లెట్ ట్రైన్ సర్వే షురూ..

**హైదరాబాద్,(భారత శక్తి)** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్-చెన్నై, హైదరాబాద్-బెంగళూరు బుల్లెట్ రైలు కారిడార్ల ప్రాజెక్టులో కీలక అడుగు పడింది. నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో తెలంగాణలోని రంగారెడ్డి, నల్గొండ, వికారాబాద్ జిల్లాల పరిధిలో క్షేత్రస్థాయి (గ్రౌండ్) సర్వే ప్రక్రియ వేగంగా సాగుతోంది.

ఈ కారిడార్ల మార్గాన్ని ఖరారు చేసేందుకు సర్వే బృందాలు క్లిష్టమైన కసరత్తును నిర్వహిస్తున్నాయి.ఈ సర్వేలో భాగంగా రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కురుమిద్ద, మేడిపల్లి, మంకీస్‌గూడెం, చింతపట్ల వంటి పలు గ్రామాల్లోని పొలాలు, ఖాళీ స్థలాలలో ఎరుపు, తెలుపు రంగులతో ప్రత్యేక మార్కింగ్‌ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. హైదరాబాద్-చెన్నై కారిడార్ శంషాబాద్, యాచారం మీదుగా నల్గొండ జిల్లా నాంపల్లి వైపు, అలాగే హైదరాబాద్-బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది. అలాగే హైదరాబాద్-బెంగళూరు కారిడార్ శంషాబాద్, షాబాద్ మండలాల మీదుగా సాగేలా ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం చేశారు.ఇప్పటికే ఈ హైస్పీడ్ రైలు మార్గాలకు సంబంధించి ఏరియల్ సర్వే విజయవంతంగా ముగిసింది.

ప్రస్తుతం జరుగుతున్న క్షేత్రస్థాయి గ్రౌండ్ సర్వే పూర్తిగా పూర్తయితే, ప్రాజెక్టుకు సంబంధించిన తుది ఎలైన్‌మెంట్, బుల్లెట్ రైలు స్టేషన్లు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలనే లొకేషన్లు, భవిష్యత్తులో అవసరమయ్యే భూసేకరణ పరిధిపై పూర్తి స్పష్టత రానుంది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 నుండి 3 గంటలకు తగ్గిపోనుంది.

# 'బ్రేక్ ఫాస్ట్' మూవీ రివ్యూ!



రానవ్ – రోస్మిన్ ప్రధానమైన పాత్రలను పోషించిన తమిళ సినిమానే 'బ్రేక్ ఫాస్ట్'. గిరిజా వరదరాజ్ నిర్మించిన ఈ సినిమాకి, గాంధీకృష్ణ దర్శకత్వం వహించాడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా, ఏప్రిల్ 24వ తేదీన థియేటర్లకు వచ్చింది. సంపత్ రాజ్ – అర్చన కీలకమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఈ నెల 24వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. తమిళంతో పాటు తెలుగు .. కన్నడ భాషల్లో ఈ సినిమా అందుబాటులో ఉంది. శంతను (రానవ్) ఇంజనీరింగ్ పూర్తి చేసి, మలేసియాలో కొంతకాలం పాటు జాబ్ చేస్తాడు. ఆ తరువాత కొన్ని కారణాల వలన అతను అక్కడి నుంచి వచ్చేయవలసి వస్తుంది. అయితే తాను మలేసియాలో ఉన్నట్టుగానే తల్లిదండ్రులను నమ్మిస్తూ, వాళ్ల అవసరాలను తీరుస్తుంటాడు. తండ్రి ట్రీట్మెంట్ కి తగిన డబ్బును పంపిస్తూ ఉంటాడు. తన సర్టిఫికెట్స్ కూడా సీజ్ చేయబడటంతో, డబ్బు కోసం తనకి తోచిన పనులను చేస్తూ వెళుతుంటాడు. అలాంటి అతను ఒక రోజున జాన్వీ (రోస్మిన్) కంటపడతాడు. ఆ తరువాత కూడా ఒకటి రెండు సార్లు ఆమెకి తారసపడతాడు. అతని కేరక్టర్ ఆమెకి చాలా ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. శ్రీమంతుడైన రాజారామ్ (సంపత్ రాజ్)కి ఆమె కూతురు. తండ్రి నడుపుతున్న బిస్కట్ కంపెనీకి ఆమె జె ఎమ్ డి గా ఉంటుంది. అలాంటి ఆమె శంతను గురించి తెలుసుకుని అతనికి తమ సంస్థలో జాబ్ ఇస్తుంది. అప్పటి నుంచి వాళ్లిద్దరి మధ్య పరిచయం మొదలై అది కాస్తా ప్రేమగా మారుతుంది .. పెళ్లి వరకూ వెళుతుంది. రాజా రామ్ మొదటి భార్య కూతురే జాన్వీ. తన కూతురు శంతనును ప్రేమిస్తుందనే విషయం అతనికి తెలిసిపోతుంది. ఈ విషయంలో అతను కూతురును మందలిస్తాడు. తన అంతస్తుకి తగిన వాడిని పెళ్లి చేసుకోమని చెప్పి, ఒక సంబంధం తీసుకొస్తాడు. అప్పుడు జాన్వీ ఏం చేస్తుంది? ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? శంతనుతో ఆమె జీవితం ఎలా కొనసాగుతుంది? అనేది మిగతా కథ. రిషభ్ – లక్ష్మీ అనే ఇద్దరు యువతీ యువకులు ప్రేమించుకుని పెళ్లి చేసుకుంటారు. పెళ్లైన మూడు నెలలకే విడిపోవాలని నిర్ణయించుకుంటారు. ఈ విషయంలో కౌన్సిలింగ్ కోసం సైకియాట్రిస్ట్ 'గంగాదేవి'( కస్తూరి)ని కలుస్తారు. తనముందే వాళ్లిద్దరూ పడుతున్న గొడవను చూసిన గంగాదేవి, గతంలో జరిగిన శంతను – జాన్వీ ప్రేమకథను చెప్పడం మొదలుపెట్టడంతోనే అసలు కథ మొదలవుతుంది. ఈ గంగాదేవికి .. ఆ శంతను కథకు లింక్ ఏమిటి? అనే కుతూహలాన్ని రేకిత్తిస్తూ దర్శకుడు ఈ కథను నడిపించాడు. శ్రీమంతురాలైన జాన్వీ, పేదింటికి చెందిన శంతనును ప్రేమించడం .. తండ్రిని ఎదిరించి పెళ్లి చేసుకోవడం .. తన సంస్థను అతని చేతులలో పెట్టడం .. ఫస్టాఫ్ గా కొనసాగుతుంది. ఇక శంతను తల్లిదండ్రులు ఆ ఇంటికి రావడం .. ఆ పల్లె మనుషుల అలవాట్లు ఆమెకి నచ్చకపోవడం .. వాళ్ల విషయంలో ఆమె కఠిన వైఖరి సెకండాఫ్ పై మరింత కుతూహలాన్ని పెంచుతూ వెళతాయి. భార్యాభర్తల మధ్య ఈగోలు ఈ కథను మరింత వేడెక్కిస్తూ ప్రీ క్లైమాక్స్ దిశగా నడిపిస్తాయి.

సాధారణంగా తండ్రి బాగా డబ్బు – పలుకుబడి ఉన్న వ్యక్తి అయినప్పుడు, కూతురు అతనికి ఇష్టం లేని పెళ్లి చేసుకోవాలనుకున్నప్పుడు .. ఆ తండ్రి ఏం చేస్తాడోననే ఒక టెన్షన్ ఆడియన్స్ కి ఉంటుంది. అందుకు తగినట్టుగానే ఆ తండ్రి రకరకాలుగా ఇబ్బంది పెట్టడం జరుగుతుంటుంది. కానీ అక్కడి నుంచి అందుకు భిన్నంగా ఈ కథ ముందుకు వెళుతుంది. తండ్రి పాత్ర పక్కకి వెళ్లిపోయి, భార్యాభర్తలు తలపడటం కొత్తగా అనిపిస్తుంది. కథలో ఎక్కువ భాగం హీరో – హీరోయిన్ చుట్టూ తిరుగుతుంది. ప్రేమికులుగా .. భార్యాభర్తలుగా వాళ్ల పాత్రలలో వేరియేషన్స్ ఉంటాయి. వాళ్లిద్దరూ అలా గొడవపడుతూ ఉంటే, చివరిలో కనువిప్పు కలగడం కామనే గదా అనుకుంటాము. కానీ అక్కడే ఎవరూ గెస్ చేయని ఒక ట్విస్ట్ పడుతుంది. ఆ ట్విస్ట్ అప్పటివరకూ చూసిన కథ బరువును పెంచుతుంది. ఈ కంటెంట్ ను యావరేజ్ ప్లేస్ లో నిలబెడుతుంది. ప్రధానమైన పాత్రలను పోషించిన వాళ్లంతా బాగా చేశారు. డబ్బు .. అహంభావం కూడిన పాత్రలో రోస్మిన్ నటన ఆకట్టుకుంటుంది. తన మాట మాత్రమే నెగ్గాలనే పంతం కలిగిన ఆ పాత్రలో ఆమె అభినయం మెప్పిస్తుంది. ఇక తల్లిదండ్రుల పట్ల బాధ్యతగా మసలుకునే పాత్రలో రానవ్ నటన మంచి మార్కులు కొట్టేస్తుంది. పన్నీర్ సెల్వమ్ ఫొటోగ్రఫీ .. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం .. ఫరవాలేదు. భాస్కర్ ఎడిటింగ్ ఓకే. తల్లిదండ్రులను ప్రేమించలేనివారు మరెవరినీ ప్రేమించలేరు. బంధాలకు .. అనుబంధాలకు విలువనీయలేరు. ఈగో కారణంగా వైవాహిక జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. సర్దుకుపోవడంలోనే సంతోషం ఉంటుంది అనే సందేశాన్ని ఇచ్చిన ఈ సినిమా, యావరేజ్ కేటగిరీలోకి వస్తుందని చెప్పొచ్చు.

# హీరోయిన్ హనీ రోజ్‌కు క్షమాపణ చెప్పిన వ్యాపారవేత్త




కేరళకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త బాబీ చెమ్మనూర్ హీరోయిన్ హనీ రోజ్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. ఒక జ్యువెలరీ షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకలో హనీ రోజ్‌ను ఉద్దేశించి ఆయన చేసిన కొన్ని వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. తనపై లైంగిక భావనలతో కూడిన, అవమానకరమైన వ్యాఖ్యలు చేశారంటూ హనీ రోజ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చెమ్మనూర్‌పై క్రిమినల్ కేసు నమోదైంది.

ఈ నేపథ్యంలో, బాబీ చెమ్మనూర్ తన ఫేస్‌బుక్ ఖాతా ద్వారా స్పందిస్తూ, తన వ్యాఖ్యలు హనీ రోజ్‌ను, ఆమె కుటుంబాన్ని బాధపెట్టాయని గ్రహించానని... ఈ ఉదంతానికి పూర్తి బాధ్యత వహిస్తూ మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ప్రకటించారు. ఆమెను బాధపెట్టాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, ఈ సమస్యను సానుకూలంగా పరిష్కరించుకోవడానికి తాను సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. అలాగే ఆమె తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.మరోవైపు, ఈ వివాదంపై గతంలో మాట్లాడిన హనీ రోజ్... తన లుక్స్‌పై వచ్చే సరదా జోకులను, మీమ్స్‌ను తాను కూడా స్పోర్టివ్‌గా తీసుకుంటానని, కానీ ప్రతి దానికి ఒక హద్దు ఉంటుందని స్పష్టం చేశారు. అసభ్యకరమైన, గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించేది లేదని ఆమె తేల్చి చెప్పారు. వ్యాపారవేత్త చెమ్మనూర్ చేసిన ఈ బహిరంగ క్షమాపణలపై హనీ రోజ్ ఇంకా స్పందించాల్సి ఉంది.

# 'రంభ ఊర్వశి మేనక'..

## మళ్లీ కామెడీ బాటపట్టిన అల్లరి నరేశ్




గత కొంతకాలంగా 'నాంది', 'ఉగ్రం' వంటి సీరియస్, ఇంటెన్స్ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన ప్రముఖ నటుడు అల్లరి నరేశ్, మళ్లీ తన ట్రేడ్ మార్క్ కామెడీతో అలరించేందుకు సిద్ధమయ్యారు. అల్లరి నరేశ్ పుట్టినరోజు సందర్భంగా తన 65వ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాకు 'రంభ ఊర్వశి మేనక' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రాన్ని ఒక సోషియో ఫాంటసీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. టైటిల్‌తోనే సినిమాలో కామెడీ, ఫాంటసీ అంశాలు పుష్కలంగా ఉంటాయని స్పష్టమవుతోంది. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ పతాకాలపై ఈ సినిమాను సంయుక్తంగా నిర్మిస్తున్నారు. చంద్రమోహన్ చింతాడ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అల్లరి నరేశ్ కామెడీ చిత్రాలకు పెట్టింది పేరు. అయితే, నటుడిగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకునే క్రమంలో ఇటీవల సీరియస్ కథలను ఎంచుకున్నారు. ఇప్పుడు మళ్లీ తన కామెడీ జానర్‌లోకి వస్తుండటంతో అభిమానులు, సినీ ప్రేక్షకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ సినిమాకు చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, 2026 సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు.

# ఓటీటీలోకి లీగల్ సస్పెన్స్ థ్రిల్లర్!



థ్రిల్లర్ జోనర్ కి సంబంధించిన కంటెంట్ కి ఓటీటీ ఫ్లాట్ ఫామ్స్ పై ఉన్న క్రేజ్ గురించి అందరికీ తెలిసిందే. ఆ థ్రిల్లర్ కి సస్పెన్స్ తోడైతే .. ఆ సస్పెన్స్ ఒక క్రైమ్ తో ముడిపడి ఉంటే .. ఇవన్నీ కలిసి కోర్టు చుట్టూ తిరుగుతూ ఉంటే రేకెత్తే ఆసక్తి గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. అలాంటి ఒక లీగల్ థ్రిల్లర్ ఓటీటీ ప్రేక్షకుల ముందుకు రావడం కోసం ఆత్రుత పడుతోంది. ఆ థ్రిల్లర్ సినిమా పేరే 'ఇక్కా'. సన్నీడియోల్ .. అక్షయ్ ఖన్నా ప్రధానమైన ప్రధానమైన పోషించిన సినిమా ఇది. సిద్ధార్థ్ మల్హోత్రా రూపొందించిన ఈ సినిమా, కోర్టు రూమ్ డ్రామాగా నడుస్తుంది. ప్రముఖ లాయర్ అర్జున్ మెహ్రా పాత్రలో సన్నీ డియోల్ .. హత్యాయత్నం కేసులో నిందితుడైన శౌర్యమన్ పాత్రలో అక్షయ్ ఖన్నా కనిపించనున్నారు. ఇతర ముఖ్యమైన పాత్రలలో దియా మీర్జా .. తిలోత్తమ .. శిశిర్ శర్మ .. ఆకాంక్ష అలరించనున్నారు. జులై 10వ తేదీ నుంచి ఈ సినిమాను 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన ట్రైలర్ ను కూడా వదిలారు. నగరంలో అర్జున్ మెహ్రాకి లాయర్ గా మంచి పేరు ఉంటుంది. ఆయన ఒక కేసును టేకప్ చేశాడంటే, ఆ కేసు ఓడిపోవడమనేది జరగదనే నమ్మకం అందరిలో ఉంటుంది. అందువలన ఆయనకి ఎదురుగా నిలబడి వాదన చేయడానికి మిగతా లాయర్లు భయపడుతుంటారు. అలాంటి అర్జున్ ను శౌర్యమన్ ఆశ్రయిస్తాడు. తనని ఒక కేసు నుంచి కాపాడమని కోరతాడు. అతను చేసిందేమిటి? ఆ కేసు విషయంలో అర్జున్ కి ఎదురైనా సవాళ్లు ఏమిటి? అనేది మిగతా కథ. ఈ సినిమా ఓటీటీ ఆడియన్స్ ను ఏ స్థాయిలో మెప్పిస్తుందనేది చూడాలి మరి.

# 'దూరదర్శని' మూవీ రివ్యూ!



ప్రేమకథలకు యూత్ లో మంచి క్రేజ్ ఉంటుంది. ఇక విలేజ్ నేపథ్యంలోని ప్రేమకథలకు మరింత ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలాంటి ఒక ప్రేమకథగా 'దూరదర్శని' కనిపిస్తుంది. సువిక్షిత్ – గీతికా రతన్ జతగా నటించిన సినిమా ఇది. పబ్లిసిటీ పరంగా పెద్ద హడావిడి చేయకుండానే థియేటర్లకు వచ్చింది. అందువలన థియేటర్లలో నిలబడలేకపోయింది. మే 15వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, జూన్ 26వ తేదీ నుంచి 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతోంది. అది ఒక అందమైన పల్లెటూరు .. దాని పేరు 'మట్టుపర్రు'. అక్కడ హరి (సువిక్షిత్) తన తల్లిదండ్రులతో కలిసి నివసిస్తూ ఉంటాడు. ఇంటర్ చదివిన హరి, పై చదువులకు పట్నం వెళ్లాలనే ఆశను చంపుకుంటాడు. ఎందుకంటే ఉన్నకొద్ది పొలాన్ని అమ్మేయడం అతనికి ఇష్టం ఉండదు. అందువలన ఊళ్లోని స్నేహితులతో కలిసి తిరుగుతూ ఉంటాడు. హరి తండ్రి రాజయ్య ఉన్న కొద్దిపాటి పొలాన్ని సేద్యం చేసుకుంటూ, పరశురామ్ దగ్గర పనిచేస్తుంటాడు. పరశురామ్ శ్రీమంతుడు .. ఒక రకంగా చెప్పాలంటే ఆ ఊరు మోతుబరి. అతనంటే ఆ ఊళ్లో అందరికి భయమే. అందువల్లనే ఆయన చెల్లెలు వాణి (గీతికా రతన్) వైపు చూసే సాహసం ఎవరూ చేయరు. పట్నంలో చదువుకుంటున్న ఆమె, పరీక్షల తరువాత ఆ ఊరుకు వస్తుంది. అయితే తొలి చూపులోనే వాణిని చూసి హరి మనసు పారేసుకుంటాడు. 'పేకబాబు' ఇంట్లో 'చిత్రలహరి' చూడటానికి వచ్చిన హరి – వాణి ఇద్దరూ ప్రేమలో పడతారు. తన ఇంటికి 'చిత్రలహరి' చూడటానికి వస్తున్న వాణిని పేకబాబు కూడా ఇష్టపడతాడు. అయితే ఆమె హరితో సన్నిహిత్యంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతుంటాడు. కులమతాలపైనే పరువు ప్రతిష్ఠలు ఆధారపడి ఉంటాయని బలంగా నమ్మే ఆ ఊళ్లో, తమ ప్రేమ గెలవలేదనే విషయం ఆ జంటకు అర్థమైపోతుంది. అప్పుడు వాళ్లు ఏం చేస్తారు? ఆ తరువాత చోటుచేసుకునే సన్నివేశాలు ఎలాంటివి? అనేది మిగతా కథ. ప్రేమకి కులమతాలు .. ఆర్థికపరమైన స్థితిగతులు ఎప్పటికీ అడ్డుగోడలేనని చెప్పాలి. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న కట్టుబాట్ల కారణంగా, ఈ అంతరాలు మరింత బలంగా కనిపిస్తూ ఉంటాయి. విలేజ్ నేపథ్యంలో ఒక పేదింటి అబ్బాయి .. కలవారి అమ్మాయికి మధ్య నడిచే ప్రేమకథలతో గతంలో చాలానే సినిమాలు వచ్చాయి. అలాంటి కథతో చేసిన మరో ప్రయత్నంగా ఈ సినిమా నిలుస్తుంది. హీరోయిన్ అన్నయ్య ఒక మోతుబరి .. ఒక రకంగా విలన్ షేడ్స్ తో భయపెట్టే రకం. ఇక అదే ఊళ్లో మరో డబ్బున్న యువకుడు .. అతను కూడా విలన్ షేడ్స్ ను కలిగినవాడే. హీరోయిన్ పై మనసు పారేసుకున్న ఈ డబ్బున్న దొరబాబు, ఆల్రెడీ హీరోయిన్ మనసు దోచుకున్న హీరోపై ద్వేషంతో ఉంటాడు. ఈ నాలుగు పాత్రల చుట్టూనే ఈ కథ తిరుగుతూ ఉంటుంది. ఇక హీరోయిన్ ను హీరో కలుసుకునేలా చేయడంలోనే తమ జీవితం ధన్యమైందని భావించే మిత్ర బృందం ఇందులోనూ కనిపిస్తుంది. కాకపోతే ఆ టీమ్ చేసే కామెడీ కాసింతైనా పండలేదు. ప్రధానమైన నాలుగు పాత్రలను బలంగా తీర్చిదిద్దడానికి అవకాశం ఉంది. కానీ ఆ దిశగా అంత కసరత్తు జరగలేదనే విషయం అర్థమైపోతూనే ఉంటుంది. పాత్రలను సరిగ్గా డిజైన్ చేయకపోవడం వలన, సన్నివేశాలపై సరైన శ్రద్ధ పెట్టకపోవడం వలన .. ఆశించినస్థాయి అవుట్ పుట్ లేకుండా తేలిపోతుంటాయి. రొటీన్ గా అనిపిస్తూ నిరాశపరుస్తూ ఉంటాయి. 1980లలో బాగా డబ్బున్న ఇళ్లలోనే టీవీలు ఉండేవి. అందువలన చుట్టుపక్కల వాళ్లు వెళ్లి అక్కడ కూర్చునేవారు. అలా పేదింటివాడైన హీరో వెళ్లి వేరే ఇంట్లో టీవీ చూశాడంటే అర్థం ఉంది. కానీ మోతుబరి అయిన పరశురామ్ ఇంట్లో టీవీ లేకపోవడం .. అతని చెల్లెలు కూడా వేరే ఇంటికి వెళ్లి టీవీ చూడటం చిత్రంగా అనిపిస్తుంది. కొత్తగా పెళ్లయిన భద్రం పాత్ర ద్వారా కామెడీని పండించడానికి చేసిన ప్రయత్నం .. కులమతాల అంతరాల కారణంగా శారద బలైపోవడం వంటి ఎమోషనల్ సీన్స్ కూడా పేలవంగా అనిపిస్తాయి.ప్రేమికులు ఒక నిర్ణయం తీసుకునేప్పుడు తమని కన్న వాళ్లను గురించి ఒకసారి ఆలోచన చేయండి అనే సందేశం ఇవ్వడానికి చేసిన ప్రయత్నం బాగుంది. కానీ ఆ సందేశం చుట్టూ ఒక ఆసక్తికరమైన కథను అల్లుకోలేకపోయారు. మురళీ మోహన్ రెడ్డి ఫోటోగ్రఫీ .. ఆనంద్ సంగీతం ఫరవాలేదు. అక్కడక్కడా పాటల్లో సాహిత్యం బాగుందనిపిస్తుంది. ' ఇంద్రధనస్సు కట్టినావే కంటి గడపకి .. వరదలేవో తెచ్చినావే గుండె పడవకి' వంటి లైన్స్ మనసుకు పట్టుకుంటాయి. కథాకథనాలు బలహీనమైనవే అయినా, విలేజ్ నేపథ్యంలో దృశ్యాలు మనసుకు హాయిగా అనిపిస్తాయి. పంటపొలాలు .. కొబ్బరి తోటలు .. ఇటుక బట్టీలు .. కాలి బాటలు .. గోదారి ఒడ్డు .. ఈ కథకు అందమైన ఆభరణంలా అనిపిస్తాయని చెప్పాలి. విలేజ్ నేపథ్యంలో లొకేషన్స్ కోసం ఈ సినిమా చూడొచ్చు.

# అమెజాన్ ప్రైమ్‌లో సెల్వ రాఘవన్ మూవీ!



సెల్వ రాఘవన్ మంచి దర్శకుడు .. మంచి నటుడు కూడా. మొదటి నుంచి కూడా సెల్వ రాఘవన్ విభిన్నమైన కథలకు .. విలక్షణమైన పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ వస్తున్నాడు. అందువలన ఆయన పోషించిన పాత్రలు చాలా కాలం పాటు గుర్తుండిపోతుంటాయి. ఆయన ఒక సినిమా చేశాడు అంటే, అందులో కొత్త పాయింట్ ఉండి ఉంటుందనే ఒక బలమైన నమ్మకం ఆడియన్స్ లో ఉంటుంది. అలా ఆయన ప్రధానమైన పాత్రను పోషించిన సినిమానే 'మనితం దైవమగళం'. తమిళనాడులోని ఒక గ్రామీణ ప్రాంతం నేపథ్యంలో సాగే ఈ సినిమా, ఏప్రిల్ 10వ తేదీన థియేటర్లకు వచ్చింది. విజయ్ సతీశ్ నిర్మించిన ఈ సినిమాకి, డెన్నిస్ మంజునాథ్ దర్శకత్వం వహించాడు. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'అమెజాన్ ప్రైమ్'లో అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం తమిళంలో మాత్రమే స్ట్రీమింగ్ అవుతోంది. త్వరలో తెలుగు ఆడియోతోను ప్రేక్షకులను పలకరించనుంది. గ్రామీణ ప్రాంతం .. అక్కడ ప్రజల జీవన విధానం .. స్థానికంగా నడిచే వ్యాపారాలు .. రాజకీయాలు .. పగలు .. ప్రతీకారాలు వంటి అంశాలు ఈ కథలో కనిపిస్తాయి. సెల్వ రాఘవన్ – మైమ్ గోపీ పాత్రలు .. వారి నటన ఈ సినిమాకి హైలైట్ గా నిలవనున్నాయి. అలాగే రవివర్మ కెమెరా పనితనం .. ప్రియన్ నేపథ్య సంగీతం ప్రధానమైన బలంగా కనిపిస్తాయి. గ్రామీణ నేపథ్యంలో కథలను ఇష్టపడేవారికి ఈ సినిమా త్వరగా కనెక్ట్ అవుతుందనే చెప్పాలి.

# సామర్లకోటలో విషాదం.. ఒకరి మృతి



**(భారత శక్తి)**సామర్లకోట కెనాల్ రహదారిలో మంగళవారం రెండు లారీలు ఢీకొన్న ప్రమాదంలో ఒక డ్రైవర్ మృతిచెందారు. కోల్కాతా నుంచి కాకినాడకు మోటార్ సైకిల్ లోడుతో వెళ్తున్న కంటైనర్ లారీని, ఎదురుగా వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టిందని ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన మరో లారీ డ్రైవర్ను పోలీసులు అరెస్టు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## వైఎస్ జగన్ను కలిసిన
# సింగపూర్ కాన్సులేట్ జనరల్



**విజయవాడ(భారత శక్తి)** వైసీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సింగపూర్ కాన్సులేట్ జనరల్ (చెన్నై) ఎడ్గర్ పాంగ్తే చియాంగ్ మంగళవారం కలిసారు. సోమవారం నాడు మంత్రి లోకేష్ ను సింగపూర్ కాన్సులేట్ జనరల్ బృందం కలిసింది. మంగళవారం నాడు వైఎస్ జగన్తో భేటీ అయింది.

# విజయవాడ ధర్నా చౌక్లో తీవ్ర ఉద్రిక్తత..

**– కదం తొక్కిన రైతులు**

**విజయవాడ(భారత శక్తి)** విజయవాడ ధర్నా చౌక్ లో వామపక్షాలు కదం తొక్కాయి. దాంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. సీఎం డౌన్ డౌన్.. రైతు ద్రోహి చంద్రబాబు అంటూ ఆందోళన కారులు నినాదాలు చేసారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఐ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో "సీఎంకు రాయబారం" కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, రైతు సంఘం నాయకులు, రైతులు సీఎం ఇంటికి బయల్దేరారు. పోలీసులు బారికేడ్లు పెట్టి రైతులను అడ్డుకున్నారు. పోలీసులతో రైతులు తీవ్రవాగ్వాదానికి దిగారు. పోలీసుల ఆంక్షలను దాటి సీఎం ఇంటికి వెళ్లేందుకు రైతులు ప్రయత్నించారు. ధర్నాచౌక్, స్వర్ణపాలెస్ జంక్షన్ల వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా
# బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు

**హైదరాబాద్,(భారత శక్తి)** రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు, మంగళవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించిన కే. రామకృష్ణా రావు, ఈ రోజు పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో 1992 బ్యాచ్కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం జూన్ 26న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు సంజయ్ జాజు నూతన సీఎస్గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, వివిధ శాఖల విభాగాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుతో పాటు కే. రామకృష్ణా రావును పుష్పగుచ్ఛాలతో అభినందించారు.

## పోలింగ్ స్టేషన్స్ జాబితా
# తయారీ గురించి చర్చిస్తాం

**- ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్**

**- నవతరం పార్టీ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యంకు లేఖ**

**చిలకలూరిపేట(భారత శక్తి)** నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం ఎస్ ఐ ఆర్ విషయంలో రిజిస్టర్ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ కు రాసిన లేఖకు స్పందించిన ఏపీ సీఈఓ రాష్ట్ర పరిధిలో అన్నీ జిల్లాల కలెక్టర్లకు లెటర్. ఔనీ.803/ఎలక్స్.బి /ఏ 1/2026-1 ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ఎలక్టోరల్ రోల్స్ మాన్యువల్, 2023లోని 11వ అధ్యాయం ప్రకారం, ఎలక్టోరల్ రోల్స్ తయారీకి సంబంధించి గుర్తింపు పొందిన జాతీయ మరియు రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీలతో డిఇఓ లు మరియు సీఈఓ లు అందరూ సమావేశాలు నిర్వహించాలని తెలియజేయడమైనదని,పోలింగ్ స్టేషన్ల మాన్యువల్, 2020లోని పేరా 3.4 ప్రకారం, పోలింగ్ స్టేషన్ల జాబితాను రూపొందించేటప్పుడు జిల్లా ఎన్నికల అధికారి గుర్తింపు పొందిన మరియు గుర్తింపు పొందని రాజకీయ పార్టీల స్థానిక ప్రతినిధులు, నమోదైన మరియు పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులతో సంప్రదింపులు జరపాలని ఉత్తర్వులు జారీ చేస్తూ, కాపీ ప్రతి రావు సుబ్రహ్మణ్యం కు పంపించారు. స్పందించి ఆదేశాలు ఇచ్చిన సీఈఓ వివేక్ యాదవ్ కు నవతరం పార్టీ నుండి కృతజ్ఞతలు తెలిపారు.

## చిలకలూరిపేటలో
# త్రుటిలో తప్పిన ప్రమాదం



**చిలకలూరిపేట,(భారత శక్తి)** చిలకలూరిపేట ఎన్టీఆర్ కాలనీ వద్ద పాఠశాల వదిలిన సమయంలో రోడ్డుపైకి వచ్చిన విద్యార్థులను కాపాడేందుకు ఆక్సిజన్, హైడ్రోజన్ సిలిండర్లతో వెళ్తున్న ఆటోను డ్రైవర్ పక్కకు తిప్పగా అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో విద్యార్థులు సురక్షితంగా బయటపడగా, సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు. విద్యార్థుల భద్రతపై పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యం వహించిందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను
# పట్టుకున్న పోలీసులు

**భద్రాద్రి(భారత శక్తి)** కొత్తగూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. బూర్గంపాడు మండలం సారపాకలో గంజాయిని తరలిస్తున్న ఓ కంటైనర్ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంటైనర్లో కోట్ల రూపాయల విలువైన గంజాయి ఉన్నట్లు సమాచారం.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో భారీగా గంజాయి పట్టుబడింది. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించగా గంజాయిని తరలిస్తున్న కంటైనర్ను స్వాధీనం చేసుకున్నారు.ప్రాథమిక సమాచారం ప్రకారం కంటైనర్లో సుమారు రెండు నుంచి మూడు కోట్ల రూపాయల విలువ చేసే గంజాయి ఉన్నట్లు తెలుస్తోంది. స్వాధీనం చేసుకున్న కంటైనర్ను సారపాకలోని ఐటీసీ పేపర్ కర్మాగారం లారీ యార్డుకు తరలించి పోలీసులు భద్రపరిచినట్లు సమాచారం.సంఘటన సమాచారం అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ముఠా ఎవరనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# సిగాచి దుర్ఘటనకు ఏడాది

**సంగారెడ్డి(భారత శక్తి)** సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామిక వాడలో సిగాచి పరిశ్రమలో ఏడాది క్రితం ఘోర అగ్నిప్రమాదంలో మృతిచెందిన కార్మికులకు స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, స్థానిక బిఆర్ఎస్ నేతలు నివాళు లు అర్పించారు. ప్రమాదం జరిగి ఏడాది పూర్తవుతున్న మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ఇవ్వకపోవటంపై ఎమ్మెల్యే ఆగ్రహంవ్యక్తం చేసారు. నేడు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరుగనున్న మృతుల సంస్మరణ సభ కు అనుమతివ్వలేదని రేవంత్ సర్కార్ పై ఫైర్ అయ్యారు.. హరీశ్ రావుకు భయపడి సంస్మరణ సభ కు అనుమతి ఇవ్వకపోవడం నీచ సంస్కృతి అని మండిపడ్డారు.

# భారీ పేలుడుతో ఇల్లు ధ్వంసం

**హైదరాబాద్ (భారత శక్తి)**సరూర్నగర్ పరిధిలోని బాబూనగర్లో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి దేవేందర్ ఇంట్లో భారీ పేలుడు జరిగింది. పేలుడు ధాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసం అయింది. కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇంట్లో ఉన్న మూడు గ్యాస్ సిలిండర్లు పేలకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడుకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## సంధ్యారాణిను పరామర్శించిన
# వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు



**నరసరావుపేట(భారత శక్తి)** వినుకొండ నియోజకవర్గం నూజెండ్ల మండలం నూజెండ్ల గ్రామం నందు మాజీ మహిళా అధ్యక్షురాలు సంధ్యారాణి ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా జారిపడి గాయపడగా, నరసరావుపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (పి ఏ సి) మెంబర్ వినుకొండ మాజీ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వారితో పాటు నియోజవర్గ స్థాయి నాయకులు మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## ఎంపిడివో పదవి విరమణ కార్యక్రమానికి
# హాజరయిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




**నెరడిగొండ (భారత శక్తి)**మండల ఎంపిడిఓ సుముఖం శేఖర్ పదవి విరమణ పొందుతున్న సందర్భంగా ఈరోజు మండల కేంద్రంలోని సూర్య గార్డెన్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవి విరమణ పొందుతున్న ఎంపిడిఓ శేఖర్ గారికి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. ఎంపిడిఓ గా శేఖర్ గారు మండల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని, మండల ప్రజలకు సేవలందించిన శేఖర్ గారు ఇప్పుడు కుటుంబానికి సమయం కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలిమ రవీందర్, ఉప సర్పంచ్ గులాబ్, మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మాజీ జడ్పీటీసీ పండరీ, మాజీ పిఏసీఎస్ ఛైర్మన్ నానక్ సింగ్, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు గంగాధర్, మహేందర్ రెడ్డి, మహేందర్, శ్రీకాంత్, చంపేత్, విజయ్,వెంకట్రాం, అమృత్, రాజేందర్, వినేష్, నాయకులు సాబ్లే సంతోష్, రాథోడ్ సురేందర్, సుజీల్ తదితరులు ఉన్నారు.

## 38వ డివిజన్లో పలు కాలనీలలో సైన్ బోర్డుల
## ప్రారంభించిన కార్పొరేటర్ నేలకంటి రాము.




**గోదావరిఖని:(భారత శక్తి)** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మక్కాన్ సింగ్ ఆదేశాల మేరకు, 38వ డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్, హనుమాన్ నగర్, మల్లికార్జున్ నగర్, సీతానగర్, వినోబా నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సైన్ బోర్డులను 38వ డివిజన్ కార్పొరేటర్ నేలకంటి రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నేలకంటి రాము మాట్లాడుతూ, ప్రజలకు ప్రాంతాల గుర్తింపు సులభతరం కావడంతో పాటు ప్రభుత్వ సేవలు, అత్యవసర సేవలు మరింత సమర్థవంతంగా చేరేందుకు ఈ సైన్ బోర్డులు ఉపయోగపడతాయని తెలిపారు. కోట రాజు, పసరగొండ రాంకీ, సాయి, వినయ్, రాజన్న పాల్గొన్నారు.

## హెచ్సీయూలో నిరవధిక సమ్మెకు దిగిన
# కాంట్రాక్ట్ కార్మికులు

**హైదరాబాద్ (భారత శక్తి)** కేంద్రీయ విశ్వవిద్యాలయం (ఐనీఊ) లో కాంట్రాక్ట్ కార్మికులు మరోసారి ఉద్యమబాట పట్టారు. తమ దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించాలని, కార్మిక హక్కుల కాలరాటోను అరికట్టాలని డిమాండ్ చేస్తూ వర్సిటీ పరిపాలనా విభాగం ఎదుట కార్మికులు నిరవధిక నిరసనను ప్రారంభించారు.హక్కులను కాలరాస్తున్న కొత్త కార్మిక చట్టాలు..కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాల (ఒజీఎనీబీతీ అనీటవబ) వల్ల తాము తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టాల అమలుతో తమ ఉద్యోగ భద్రత కరువైందని, కార్యాలయంలో రక్షణలు బలహీనపడ్డాయని వారు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా తాము పోరాడి సాధించుకున్న ప్రాథమిక కార్మిక హక్కులను సైతం ఈ కొత్త చట్టాల సాకుతో అణచివేస్తున్నారని కార్మికులు మండిపడుతున్నారు.కొత్త కాంట్రాక్టర్ తీరుపై ఆగ్రహం..ఇటీవలే వర్సిటీకి వచ్చిన కొత్త కాంట్రాక్టర్ నియామకంతో పరిస్థితి మరింత జటిలంగా మారిందని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి..కొత్త కాంట్రాక్టర్ ఈ కార్మిక చట్టాల నిబంధనలను ఆసరాగా చేసుకుని, మాకున్న పాత హక్కులను, ప్రయోజనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల పని ప్రదేశంలో పని ఒత్తిడి పెరగడమే కాకుండా, మా జీవనోపాధికి తీవ్ర ముప్పు వాటిల్లింది." అని ఒక కార్మిక ప్రతినిధి ఆరోపించారు.డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేదే లేదువర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించి, తమతో చర్చలు జరపాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. తమకు న్యాయమైన, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని కల్పించే వరకు మరియు తమ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే వరకు ఈ నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు.ఈ నిరసనల నేపథ్యంలో యూనివర్సిటీలో ఎలాంటి పరిస్థితులు నెలకొంటాయో, పరిపాలనా విభాగం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.

## మంత్రి కొండా సురేఖ ఇంటిని
# ముట్టడించిన కార్మికులు

**హైదరాబాద్ (భారత శక్తి)**మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న కార్మికులు మంత్రి కొండా సురేఖ ఇంటిని ముట్టడించారు. పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోచుకొని మంత్రి ఇంటి మీదకు దూసుకెళ్లారు. గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారుకనీస వేతనం రూ.26 వేలుగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంత్రి నివాసం వద్దకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.

## ఫుడ్ సేఫ్టీ తనిఖీలు.. రెండు రెస్టారెంట్లకు నోటీసులు




**హైదరాబాద్ (భారత శక్తి)**ఫుడ్ సేఫ్టీ అధికారులు మియాపూర్ మదినగూడ జీఎస్ఎం ఓ మాల్లో తనిఖీలు నిర్వహించారు. బార్బెక్యూ నేషన్లో లేబుల్స్ లేని ఆహార పదార్థాలు, బొద్దింకలు, రికార్డుల లోపాలు గుర్తించారు. చైనీస్ వాక్లో శుభ్రం చేయని గుడ్ల వినియోగం, రికార్డుల కొరత, అపరిశుభ్రతపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేసారు. బార్బెక్యూ నేషన్కు 79%, చైనీస్ వాక్కు 82% హైజీన్ స్కోర్ ఇచ్చారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం




**హుస్నాబాద్ (భారత శక్తి)**హుస్నాబాద్ పట్టణంలోని 17వ వార్డులో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎఎఖీ) కార్యక్రమాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికి నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి, బీఎల్ఓలు, బీఎల్ఏలతో మాట్లాడి ప్రతి కుటుంబాన్ని తప్పనిసరిగా సందర్శించాలని సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, తొలగింపులు, చిరునామా సవరణ వంటి అంశాల్లో పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి ఎంతో ముఖ్యమని పేర్కొని , ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా, సమయానికి పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు ,ఎన్నికల సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# షాద్నగర్లో చారిత్రక ఫిరంగులు మాయం..!

**- చారిత్రక ఫిరంగుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి**

**- షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**

**- షాద్నగర్ మున్సిపల్ కార్యాలయంలో మూలకు పడేసిన ఫిరంగి రూ. 2లక్షలతో మున్సిపల్ ఎదుట - నిర్మాణం చేసి పెయింటింగ్ వేసేందుకు నిధులు మంజూరు నిధులు ఏమయ్యాయి**

**- ఫిరంగి మూలకు ఎందుకు పడింది..?**

**- ఫిరంగుల మాయంపై పోలీసులకు ఫిర్యాదు..**



షాద్నగర్**(భారత శక్తి)** పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిర్లక్ష్య స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము, ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు.ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షించి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు.ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్నగర్ సహాయ పోలీసు కమిషనర్కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.

## సాదువెల్లి పాల సొసైటీ చైర్మన్‌గా మ్యాక లక్ష్మయ్య




**భారత శక్తి, జూన్ 30 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి):** యాదగిరిగుట్ట మండలం సాదువెల్లి గ్రామంలోని మదర్ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం (పాల సొసైటీ) చైర్మన్‌గా మ్యాక లక్ష్మయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన ఎన్నికల్లో సభ్యులందరూ ఆయనకు మద్దతు తెలపడంతో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన డైరెక్టర్లుగా తిప్పారం సిద్ధులు, కామాండ్ల సిద్ధిలింగం, ఇంజ రామచంద్రం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మ్యాక లక్ష్మయ్య మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పాల ఉత్పత్తిదారుల సంక్షేమంతో పాటు సొసైటీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. అనంతరం పాల ఉత్పత్తిదారులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ దొంకెన నర్సింహులు, డైరెక్టర్లు ఇంజ శ్రీను, కామాండ్ల అయ్యలం, దయ్యాల రాములు, పి. వెంకట్ రెడ్డి, జాలిగం వెంకట నర్సు తదితరులు పాల్గొన్నారు.

## 33 ఎజెండా అంశాలకు
# కౌన్సిల్ ఆమోదం



**జగిత్యాల, జూన్ 30 (భారత్ శక్తి ప్రతినిధి):** ధర్మపురి పురపాలక సంఘ కార్యాలయంలో చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 33 ఎజెండా అంశాలతో పాటు పురపాలక సంఘ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులపై సభ్యులు విస్తృతంగా చర్చించారు. అనంతరం 33 ఎజెండా అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో కమిషనర్ ఎం. శ్రీనివాస్ రావు, వైస్ చైర్‌పర్సన్ ఇందారపు రామన్న, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

- ఆలేరు అభివృద్ధి కోసం ఎంపితో కలిసి వినతిపత్రం అందజేత



**భారత శక్తి, జూన్ 30 (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి)**ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం సిఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం చేపట్టిన భూసేకరణలో భూమి కోల్పోయిన రైతులకు నిధుల విడుదల గురించి ప్రస్తావించగా త్వరలోనే నిధులు విడుదల చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా యాదాద్రి ఆలయ పునర్నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి కూడా న్యాయం చేస్తామని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో ముఖ్యమైన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్లగా ప్రత్యేకమైన నిధులు ఇచ్చి ఆలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపినట్లు బీర్ల అయిలయ్య తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య మరియు వైద్య రంగాల అభివృద్ధి, సాగునీటి వసతులు మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలేరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమని బీర్ల అయిలయ్య పేర్కొన్నారు.

## భైంసాలో బుధవారం జిల్లా ఎస్పీ జానకి షర్మిల ప్రజా ఫిర్యాదుల స్వీకరణ



నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30: (భారత శక్తి) జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, బుధవారం (జూలై 1) భైంసా క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించి వాటిపై సంబంధిత అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయనున్నారు. జిల్లాలోని భైంసా డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వినతులను ఈ అవకాశాన్ని వినియోగించుకుని నేరుగా జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకురావాలని పోలీసు శాఖ సూచించింది. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే లక్ష్యంగా ఈ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి ప్రతినిధి, జూన్ 30 (భారత శక్తి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవీ బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజును జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నూతన సిఎస్ సంజయ్ జాజుకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, పరిపాలనాంశాలపై చర్చించారు.

## బట్టల కొట్టులో పుస్తకాల అమ్మకం

- అధికారులు సీజ్ - రాత్రికి రాత్రి పుస్తకాలు మాయం



**మంచిర్యాల ప్రతినిధి, జూన్ 30( భారత శక్తి):** ఓ ప్రైవేటు పాఠశాల అక్రమాలకు అండగా నిలుస్తూ ఆ పాఠశాల పుస్తకాలను అధిక రేట్లకు అమ్ముతున్న ఓ బట్టల వ్యాపారి దుకాణాన్ని ఇటీవల విద్యాశాఖ అధికారులు సీజ్ చేశారు. నిబంధనల విరుద్ధంగా బట్టల దుకాణంలో సదురు పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ తో పాటు పుస్తకాలను కూడా తల్లిదండ్రులకు అమ్ముతున్నారు. ఈ విషయం బయటికి రావడంతో సదర్ అధికారులు హడావుడి చేసి ఆ బట్టల దుకాణాన్ని పుస్తకాలముతున్నట్లు రుజువు కావడంతో సీజ్ చేశారు. దాదాపు 5 రోజులపాటు ఆ దుకాణం సీజ్ చేయగా సోమవారం రాత్రి 12 గంటల తర్వాత సదరు అధికారులు అండదండతోటే ఆ బట్టల షాపు యజమాని రాత్రిపూట షాపు తెరిచి అందులో ఉన్న ప్రైవేట్ పాఠశాల పుస్తకాలు నోట్ బుక్ లను ట్రాక్టర్ల ద్వారా తరలించారు. సీట్ చేసిన బట్టల వ్యాపారి దుకాణం తాళాలు సీజ్ చేసిన సదరు అధికారి ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. కాగా ఈ విషయమై మంచిర్యాల విద్యాశాఖ అధికారి ఫోన్ చేసి అడగగా తాను అనారోగ్యంతో ఉన్నానని తర్వాత మాట్లాడతానని దాటవేసి ఫోన్ కట్ చేయడం కొసమెరుపు.

## సిరిసిల్ల జిల్లాలో ఆహార భద్రత
# గాల్లో దీపమేనా..?


- బాలాజీ స్వీట్ హౌస్‌లో బల్లి కలకలం!
- పానీపూరి ఘటన మరువకముందే.. తీపి దుకాణంలో చేదు నిజం.
- అధికారుల పర్యవేక్షణ శూన్యం!
- వినియోగదారుడిపై యజమాని దురుసుతనం.

**భారత శక్తి న్యూస్, రాజన్న సిరిసిల్ల, జూన్ 30:** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆహార భద్రత అధికారుల పర్యవేక్షణ లోపం మళ్లీ బట్టబయలైంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన పానీపూరి ఉదంతం మరువక ముందే, సిరిసిల్ల పట్టణంలో మరో ఘోర నిర్లక్ష్యం వెలుగుచూసింది. పట్టణంలోని ప్రముఖ 'బాలాజీ స్వీట్ హౌస్' లో లభించిన ఆహార పదార్థాలలో బల్లి కలకలం రేపడం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణానికి చెందిన చందు అనే వినియోగదారుడు తన పిల్లల కోసం బాలాజీ స్వీట్ హౌస్‌లో బోంది కార, రింగ్స్, గాటు వంటి స్నాక్స్ కొనుగోలు చేశాడు. ఇంటికి వెళ్లి చూడగా ఆ తినుబండారాల మధ్య చనిపోయిన బల్లి కనిపించడంతో సదరు వినియోగదారుడు ఒక్కసారిగా కంగుతిన్నాడు. పిల్లల ప్రాణాలతో ముడిపడి ఉన్న విషయాన్ని ప్రశ్నించేందుకు సదరు దుకాణానికి వెళ్లిన బాధితుడికి అక్కడి యజమాని, సిబ్బంది నుండి దారుణమైన సమాధానం ఎదురైంది. కనీసం తప్పు తెలుసుకొని క్షమాపణ చెప్పాల్సింది పోయి.. "ఇంకో కిలో ఎక్కువ తీసుకోపో" అంటూ బాధ్యతారాహిత్యంగా, దురుసుగా ప్రవర్తించారని బాధితుడు చందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఇటీవలే జిల్లాలో జరిగిన పానీపూరి ఘటనపై ప్రజలు ఇంకా భయాందోళనల నుండి తేరుకోకముందే, ఇలాంటి ఘటనలు పునరావృతం కావడంపై పట్టణవాసులు తీవ్రంగా మండిపడుతున్నారు. అసలు



పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉన్నారా? లేక నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారా? అంటూ బాహాటంగానే ప్రశ్నిస్తున్నారు. హోటళ్లు, స్వీట్ హౌస్‌లలో కనీస పరిశుభ్రత ప్రమాణాలు పాటించకపోయినా అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వల్లే, వ్యాపారులు ఇంతలా బరితెగించి వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి, సదరు స్వీట్ హౌస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని, జిల్లా వ్యాప్తంగా నిరంతర తనిఖీలు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


## కేజీబీవీలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా






నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30 (భారత శక్తి )కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో (కేజీబీవీలలో) విద్యార్థులందరికీ మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, నిర్మల్ గ్రామీణ మండలం అనంతపేట గ్రామంలో గల కేజీబీవీను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణను మొత్తం నిరంతరం పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. వర్షాకాలం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలోని విద్యార్థులు ఉపాధ్యాయుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పదవతరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఇప్పటి వారికి చెప్పిన సబ్జెక్టులను అడిగారు. వాటిల్లో నుంచి పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులతో లెక్కలు చేయించారు. సరిగ్గా లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించారు. విద్యార్థులను నాలుగు జట్లుగా విభజించి, వారితో జంబుల్ వర్డ్స్ అరేంజ్మెంట్ ఆటను ఆడిపించారు. విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఉత్సాహం చూపాలన్నారు. వసతి గృహంలో వారికి ఏవైనా సమస్యలు ఉన్నాయేమో అడిగి తెలుసుకున్నారు. త్రాగునీటి సమస్య ఉందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగానే, స్పందించిన కలెక్టర్ ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ ప్రభాకర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## ప్రజల భద్రత కోసం జీవితాన్ని అంకితం చేసిన పోలీసు సిబ్బంది సేవలు పోలీసు శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి: జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల




నిర్మల్ జిల్లా ప్రతినిధి, జూన్ (భారత శక్తి ) నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయం (డీపీఓ)లో 1989 బ్యాచ్‌కు చెందిన సుదీర్ఘకాలం పోలీసు శాఖలో విశిష్ట సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు ఉద్యోగులకు జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన సిబ్బందికి శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు ఉద్యోగం అనేది కేవలం ఒక ఉపాధి కాదని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడే అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని అన్నారు. ప్రజల భద్రత కోసం రాత్రింబవళ్లు, ఎండా వానా తేడా లేకుండా, కుటుంబాలకు దూరంగా ఉండి విధులు నిర్వర్తించే ప్రతి పోలీసు ఉద్యోగి సమాజానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించడంలో, శాంతిభద్రతల పరిరక్షణలో, నేర నియంత్రణలో 1989 బ్యాచ్‌కు చెందిన ఈ సిబ్బంది అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. వారి క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావం నేటి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఉద్యోగ విరమణ అనేది ప్రభుత్వ విధులకు మాత్రమే ముగింపు అని, సమాజ సేవకు కాదని పేర్కొంటూ, తమ అనుభవాన్ని యువతకు, సమాజానికి పంచుతూ మార్గదర్శకులుగా కొనసాగాలని సూచించారు. పదవీ విరమణ అనంతరం ఆరోగ్యంగా, ఆనందంగా కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా 1989 బ్యాచ్‌కు చెందిన పదవీ విరమణ పొందిన లిలిజె. దిగంబర్ (ఏఎస్ఐ--1704, భైంసా రూరల్ పోలీస్ స్టేషన్), డి. బాబారావు (ఏఎస్ఐ--1738, నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్), ఎం. బాలుడు (ఏఆర్‌పీసీ--3885, డీఏఆర్ నిర్మల్)లిలిలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, పోలీసు శాఖకు వారు అందించిన విశిష్ట సేవలను ప్రశంసిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ) ఎం.డి. యూనుస్ అలీ, ఆర్ఎస్ఐ శేఖర్, జిల్లా పోలీసు కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

Printed,Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446,
Cell: 9550336688,94405 08078 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy,Executive Editor: M.Venugopal Reddy